వారంలో
గత వారంలోపు వెలువడ్డ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 171 పేజీలు: 8+16 వెల: 6.50

పార్లమెంటులో చర్చలు అర్థవంతంగా సాగాలి: ప్రధాని 5
రామగుండంలో యూరియా ఉత్పత్తి పునఃప్రారంభం 6

ఢిల్లీలో పోటెత్తిన సిజెపి కార్యకర్తలు

ఆందోళనకారులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

పోలీసుల లాఠీచార్జ్

కాక్రోచ్ పార్టీ
ర్యాలీ ఉద్రిక్తం

అట్టుడికిన ఢిల్లీ

ఆందోళనకారులపై లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం

కార్యకర్తలను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

సిజెపి ప్రతినిధులతో జెపి నడ్డా చర్చలు

దీక్షలు విరమించిన వాంగ్‌చుక్, అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ,జులై 20: పరీక్షల సంస్కరణలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలో నిర్వహించిన సంసద్ చలో ర్యాలీ ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. దాదాపు 20వేలమందికిపైగా వచ్చారని చెపుతున్న ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు స్పష్టంచేసారు. అంతేకాకుండా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ర్యాలీ తీసారని పోలీసులు లాఠీ ఛార్జిచేయడంతో ఎక్కడికక్కడ ఆందోళన కారులు చెల్లాచెదురయ్యారు. మరోవైపు పార్లమెంటు స్ట్రీట్‌లోకి >>7

ఉభయసభల్లో రభస

చర్చలు లేకుండానే నేటికి వాయిదా

నీట్ లీకేజి, అయోధ్య విరాళాల చోరీపై విపక్ష సభ్యుల నిరసనలు

సోమవారం లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్షాలు

న్యూఢిల్లీ,జులై 20: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజున ఉభయసభల్లో విపక్షాల నిరవధిక నిరసనలతో మారుమోగాయి. నీటిలీకేజిలపై సిజెపి నిరసనలు, అయోధ్య విరాళాల చోరీ వంటి వాటిపై ప్రత్యేక చర్చ జరపాలంటూ విపక్షాలు పట్టుబడుతూ రావడంతో పదేపదే వాయిదా పడుతూ వచ్చాయి. విపక్ష >>2

త్రిపుర డిజిపి ఆత్మహత్య

తన ఛాంబర్‌లోనే తుపాకీతో కాల్చుకున్న వైనం

అగర్తలా,జులై 20: త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. >>2

కొత్త ఇందిరమ్మ ఇళ్లలో వచ్చేయేడు

బోనాలు ఎత్తిస్తాం


క్యూర్ పరిధిలో ఎల్ఐజి ఇళ్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్

క్యూర్ పరిధిలో తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో నిర్మాణం

నేటి నుంచి ఆగస్టు 10 దాకా దరఖాస్తుల స్వీకరణ

ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఇళ్ల మంజూరులో రిజర్వేషన్

లబ్ధిదారులకు రూ.40-60 లక్షల విలువచేసే స్థలం

4 విడతల్లో చెల్లింపు సౌకర్యం: మంత్రి పొంగులేటి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై20: హైదరాబాద్ ప్రాంతంలోని క్యూర్ పరిధిలో తొలి విడతగా 16 నియోజవర్గాల్లో ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తున్నామని, త్వరలో మరో 8 నియోజకవర్గాలలో కూడా ఈ పథకం అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పేదవాడి సొంతింటి కల నెరవేరేవరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం కొనసాగుతుందని, చివరి లబ్దిదారునికి ఇల్లు అందేవరకు కొనసాగుతుందని, ఇదినిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులతో కలిసి క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్, మీసేవ, వాట్సాప్ దరఖాస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరును ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సహేతుకంగా వివరించిన నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామానికి చెందని కొండా నాగరాజుకు లక్షరూపాయిల నగదు బహుమతిని అందజేసి మంత్రులు సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలివిడతగా 4.50 లక్షల ఇళ్ల మంజూరు చేయగా రెండవ విడతలో 2.50 లక్షల ఇళ్లు సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని ఇప్పుడు క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు ప్రారంభిస్తూ 8లక్షల ఇళ్లు పేదలకు అందిస్తున్నామని అన్నారు. వచ్చే నెలలోగా రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తికానున్నాయని అన్నారు. గత పాలకులు పనికిరాని ఆలోచన కారణంగా ఎన్నికల సమయంలో హైదరాబాద్‌కు 30-35 కిలోమీటర్ల దూరంగా ఇళ్ళను నిర్మించడం వలన కేవలం 89 వేల మంది మాత్రమే నివాసాల్లో దిగారని, మిగిలిన వారు మంజూరు పత్రాలు తీసుకున్నారే తప్పదిగలేదన్న విషయం తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. ఈ పరిస్థితుల్లో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. పేదల నివాస ప్రాంతాల్లోనే 525 చదరపు అడుగుల వైశాల్యంతో సుమారు రూ.40-60 లక్షల విలువ కలిగిన స్థలాలను >>2

హిందూ వివాహం ఒక ఒప్పందం కాదు 5

భార్యపై ఆసక్తి పోయిందంటే కుదరదు: కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

విడాకుల అభ్యర్థనను కొట్టివేసిన కోర్టు

ఎల్‌నినో ఎఫెక్ట్:

3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి

వచ్చేనెల అమలు

హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా ఎల్‌నినో వల్ల తలెత్తిన కరువు పరిస్థితుల కారణంగా పేదల ఆహారభద్రతకు ముప్పు వాటిల్లకుండా మూడునెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆరులక్షల మె.ట. సన్న బియ్యం రేషన్ డీలర్ల వద్ద నిల్వపెట్టడంకు సన్నాహాలు సోమవారం ప్రారంభించింది. ఆగస్టు,సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన సన్న బియ్యం ఒకేసారి ఇవ్వడానికి తెలంగాణ పౌరసరఫరాలశాఖ కసరత్తు మొదలు పెట్టడంతో జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లలో నిమగ్నం అయింది. తెలంగాణ >>2

మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం

చివరి దశకు పరీక్షలు

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై20: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరు ద్ధరణలో >>2

లైంగిక వేధింపుల ఉదంతంలో కొత్త ట్విస్ట్:

ట్రైనీ ఐపిఎస్ కృష్ణారెడ్డి సూసైడ్‌యత్నం!

అకాడెమీ నుంచి సస్పెన్షన్

ట్రైనీ మహిళా అధికారిణి దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణ

ఆమె తన వద్దకు వచ్చినట్లు కృష్ణారెడ్డి పేరిట లేఖ విడుదల

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంలో ట్విస్ట్ నెలకొంది. ఈ ఘటన వెలుగు చూసిన తరువాత అవమాన భారంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అతని సోదరు డు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో కోలుకుంటున్నాడు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్ర శిక్షణ వ్యవహారాల శాఖ (డిఓపిటి) దీని పై జాతీయ పోలీసు అకాడమి నుంచి అత్యవసరంగా నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఎన్‌పిఎ అధికారులు ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీనిపై డిఓపిటికి వెంటనే నివేదిక పంపారని తెలిసింది. ఇంకోవైపు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ ద్వారా ఒక లేఖ విడుదల చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మహిళా అధికారిణిని తాను వేధించలేదని, ఆమె తన గదికి వచ్చిందని, తనను ఇబ్బంది పెట్టిందని, దీనిపై తన వద్ద అన్ని ఆధారాలు వున్నాయని, ఈ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, నిజాలు నిలకడగా బయటకు వస్తాయని అందులో వుంది. కాగా ఈ వాట్సాప్ లేఖపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన జాతీయ పోలీసు అకాడమిలో ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిణిపై సహచర ట్రైనీ ఐపిఎస్ అధికారి లైంగి క వేధింపుల కేసు సోమవారం మరో మలుపు తిరిగింది. ఆదివారం సాయంత్రం వెలుగు చూసిన ఈ ఘటన పోలీసు వర్గాలను షాక్‌కు గురిచేయడం తెలిసిందే. శిక్షణలో వున్న కర్నాటకు చెందిన మహిళా ఐపిఎస్ అధికారిణిని ఎపికి చెందిన ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదుపై నగర పోలీసు విభాగంలోని అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం విదితమే. ఈ నెల తొమ్మిదవ తే దీన తనపై ఉదయ్ కృష్ణారెడ్డి భౌతికంగా దాడులకు పాల్పడినట్లు, కత్తితో చంపుతానని బెదిరించినట్లు ట్రైనీ మహిళా అధికారిణి >>2

బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ రాజీనామా 3

కొత్త ప్రధానిగా ఆండీబర్న్‌హామ్

భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు

అమెరికాకు ఇరాన్ హెచ్చరిక 5

కాళేశ్వరాన్ని 'వేడెక్కిస్తున్న' ఎల్‌నినో

గోదావరి నీటి ఎత్తిపోతల చుట్టూ రాజకీయం

కాంగ్రెస్,బిఆర్ఎస్ పోట్లాటలో నలుగుతున్న రైతాంగం

ఎన్‌డిఎస్ఎ సూచనలతో నీరు ఎత్తిపోయాలంటున్న నిపుణులు

హైదరాబాద్,జులై 20 ప్రభాతవార్త: భూమధ్యరేఖ వెంబడి సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో వేడినీటిని పసిఫిక్ మహాసముద్రంలోకి వెళ్ళకుండా పశ్చిమ దిశకు తోసేయడంఎల్ నీనో అంటారు. ఆ ఎల్ నీనో మాత్రం తెలంగాణలో గోదావరినది జలాలు మోసుకొచ్చే కాళేశ్వరంను వేడెక్కించింది. ఎల్‌నినో ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాలన్నింటి కంటే ఎక్కువగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కుంటలు చెరువులులతోపాటు రాష్ట్రం లోని భారీ,మధ్య,చిన్నతరహా జలాశయాల్లో నీటి రోజురోజుకు అడుంగంటిపోతూ అత్యంత ఆందోళనకరంగా మారింది. మేడిగడ్డ కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రభుత్వం, ప్రతిపక్షాలు భిన్న అభిప్రాయాలు చెబతుండటంతో రైతాంగం మాత్రేమ కాదు తాగునీటి కటకట ఎదుర్కొంటున్న సాధారణ ప్రజలు తీవ్ర అనిశ్చితికి గురవుతున్నారు. దేవాదుల నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ఎందుకు పంపులు ఆన్ చేయడంలేదని సామాన్యులు కూడా ప్రశ్నించుకొంటున్నారు. మేడిగడ్డ నుంచి ఈ సీజన్‌లో ఇప్పటికే 66 టిఎంసిల నీరు ఇప్పటికే తెలంగాణ సరిహద్దుదాటి వెళ్ళాయని కన్నెపల్లి పంపుహౌజ్‌లు ఆన్ చేయాలని కోరుకొనేవారు నీటిలెక్కలు చెబుతున్నారు. జులై మొదటి రెండువారాల్లో మేడిగడ్డ నుంచి పెద్ద ఎత్తున వరద కిందికి పోయినట్లు నీటిపారుదలశాఖ గణాంకాలుకూడా చెబుతున్నాయి. గోదావరిలో జులై 6న అత్యధికంగా 1,22,270 క్యూసెక్కుల ప్రాణహిత వరద కిందికి తరలిపోయింది. జులై ఒకటిన మేడిగడ్డ వద్ద 4750 క్యూసెక్కుల వరద మరుసటిరోజనాటికి 12,250కిపెరిగి క్రమంగా జులై 3న 19వేల క్యూసెక్కులకు చేరింది. జులై4న 90580కూసెక్కులు, జులై7,8వ తేదిల్లో 87వేల క్యూసెక్కులు నీటి ప్రవాహం అక్కడ నుంచిదిగువకు వెళ్ళింది. మేడిగడ్డ వద్ద 93.5మీటర్ల నుంచి నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా దిగువకు వదిలి పెడుతున్నదనీ బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను కొంత మంది రిటైర్డు నీటిపారుదలశాఖ ఇంజనీర్లు సమర్థిస్తున్నారు. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు 66 టిఎంసిల జలాలను దిగువకు >>2

డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ 5



గువాహతిలో చెరువును తలపిస్తున్న రోడ్డుపై వెళ్తున్న సైకిలిస్టు

సూసైడ్‌యత్నం!

>> పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై బిఎన్ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటి చట్టంలో ని 66 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో ఢిల్లీలోని డిఓపిటి అధికారులు ఎన్‌పిఎ అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. దీని తరువాత ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి ఉన్నతా ధికారులు తాత్కాలికంగా బయటకు పంపి అనంతరం సస్పెండ్ చేయగా ఆయన నగరంలోని మోతీనగర్‌లో గల తన సోదరుడి ఇంటికి వెళ్లిన ట్లు తెలిసింది. దీనిపై ఓవైపు పోలీసుల విచారణ కొనసాగుతుండగానే సోమవారం ఉదయం ఉదయ్ కృష్ణారెడ్డి తన సోదరుడి ఇంట్లో గుర్తు తె లియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సోదరుడు ప్రణయ్ కృష్ణారెడ్డి వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు ఉదయ్ కృష్ణారెడ్డి అ త్యవసర చికిత్స అందించడంతో కోలుకున్నాడు. ఉదయ్ కృష్ణారెడ్డి ఆరోగ్యం బాగానే వుందని వైద్యులు తెలిపారు. దీనిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టినట్లు తెలిసింది. ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నంపై ఎస్ఆర్ నగర్ పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెన్షన్...

ఇదిలావుండగా జాతీయ పోలీసు అకాడమి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ అక్కడి ప్రివిలేజ్ కమిటీ ఆదేశాలు జా రీ చేయగా సోమవారం అకాడమి అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. అంతకు ముందు బాధిత ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిణి తన బాధలను అకాడమి అధికారులకు చెప్పుకోగా, దీనిపై విచారించిన ప్రివిలేజ్ కమిటీ ఇదంతా నిజమని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ట్రైనీ మ హిళా అధికారిణిని ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు, భౌతికంగా దాడులకు పాల్పడినట్లు, బ్లాక్ మెయిల్ చేసినట్లు ప్రివిలేజ్ కమిటి ని ర్ధారించినట్లు తెలిసింది. దీని తరువాత బాధిత మహిళా అధికారి చేత అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేయించినట్లు తెలిసింది. అనంతరం దీనిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై అకాడమి ప్రివిలేజ్ కమిటీ ఢిల్లీలోని డిఓపిటి కి ఒక నివేదిక పంపింది. ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమిలో తిరిగి చేర్చుకునే విషయంలో డిఓపిటిదే తుది నిర్ణయమని ప్రివిలేజ్ కమిటీ చెబుతో ంది. మరోవైపు తనపై నమోదైన కేసుతో పాటు లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలను ఉదయ్ కృష్ణారెడ్డి ఖండించాడు. దీనిపై అత ని పేరిట సోమవారం సాయంత్రం వాట్సాప్ ద్వారా వచ్చినట్లు ఒక లేఖ వైరల్ అవుతోంది. తాను అమాయకుడినని, తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, తనపై ఫిర్యాదు చేసిన మహిళా అధికారే తన గదికి వచ్చిందని, తనను ఇబ్బంది పెట్టిందని, దీనికి సంబంధించిన ఆధారాలు త న వద్ద వున్నాయని ఆ లేఖలో వుంది. అయితే ఆ అధికారిణి కావాలని తనపై దుష్ప్రచారం చేస్తోందని ఆ లేఖలో వుంది. దీనిపై నిజాలు నిలక డగా బయటకు వస్తాయని ఉదయ్ కృష్ణారెడ్డి తన లేఖలో చెప్పినట్లుగా వుంది. కాగా ఈ లేఖపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా తన సోద రుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై వచ్చిన ఆరోపణలను అతని సోదరుడు ప్రణయ్ కృష్ణారెడ్డి ఖండించాడు. కొందరు కావాలని కుట్ర చేస్తున్నట్లు అతను ఆరోపించాడు.

ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్య చేసుకోలేదు?

కాగా ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్య యత్న ఘటనపై పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయని తెలిసింది. అతను గుర్తు తెలియని పురుగుల మందు తాగినట్లు సోదరుడు తెలపగా ఇది నిజం కాదని పోలీసులు చెబుతున్నారు. అతిగా మద్యం తాగడం వల్లే అ తను అనారోగ్యం పాలయ్యాడని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని పోలీసులు చెబుతున్నారు. దీనిపై విచారణ సాగుతోందని వారు తెలిపా రు.

ఉభయసభల్లో రభస

>> సభ్యులు నీట్‌పేపర్ లీక్‌పైనా, అయోధ్యపైనల ప్లకార్డులు చేతపట్టి మరీ తమ నిరసనలను కొనసాగించారు. సమావేశాల ప్రారంభంలోనే నిరసనలు ఎదురవడంతో పార్లమెంటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఇలాగే నిరసనలు కొనసాగిస్తే సభను సజావుగా కొనసాగించడం కష్టం అవుతుందని విజ్ఞప్తిచేయడం కనిపించింది. స్పీకర్‌స్థానంలో దిలీప్ సైకియా ఉన్న సమయంలోనే మధ్యాహ్నం మళ్లీ లోక్‌సభ ప్రారంబం అయింది. సభ్యులు తమ సీట్లలో కూర్చోవాలని స్పీకర్ పదేపదే విజ్ఞప్తిచేసినా సభ్యులు చర్చలు జరపాల్సిందేననంటూ పట్టుబట్టారు. ఇప్పటికే అనేక కీలక అంశాలపై చర్చించాల్సి ఉందని, మీకు ఆసకినత కనిపించడంలేదని, ప్రజల సమస్యలు చర్చించడం మీకు ఇష్టం లేదని, ఇది సరైన పద్ధతి కాదని, మీరు పదేపదే సభకు అంతరాయం కలిగిస్తునాననరంటూ కేంద్ర మంత్రి విపక్ష సభ్యులనుద్దేశించి మాట్లాడతంతో మరింతగా నిరసనలు హోరెత్తాయి. సభలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించడం అనుమతించబోమని అన్నారు. నిరసనలమధ్యలోనే న్యాయశాఖమంత్రి సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్యను 34 ఉంచి 38కి పెంచేందుకు నిర్దేశించిన బిల్లును ప్రవేశపెట్టారు. అయితే నిరసనలమధ్య ఈ బిల్లుకు సానుకూలత రాలేదు. రాజ్యసభలో కూడా ఇదే విదంగాపదేపదే వాయిదాలు పడుతూ వచ్చింది. నీట్‌పేపర్ లీకేజిలపై ఢిల్లీలోనిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జి చేయడాన్ని విపక్ష పార్టీలన్నీ తీవ్ర నిరసన తెలుపుతూ నినాదాలుచేసాయి. ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే ఉభయసభలు తొలిరోజు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని విపక్షాలు పేపర్‌లీక్ వివాధంలో నిందితులపై చర్యలు ఏమయ్యాయంటూ నిలదీసారు. డిప్యూటి ఛైర్మన్ హరివంశ్ స్పందించి సభ్యులకు బిఏసి నిర్ణయాలను వివరించబోయారు. దీనిపై చర్చించేందుకు ప్రభుత్వానికి సమయం కూడా కేటాయించామని చెప్పినా విపక్షసభ్యులునినాదాలు హోరెత్తించారు. సమావేశాలు ప్రారంభంలో ఉభయసభల్లోను ఖతార్ షేక్ మహమద్‌బిన్ ఖలీఫా అల్‌థాని మృతికి సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. రాజ్యసభలో ఎఐసిసి అధ్యక్షుడు సభాపక్షనేత మల్లిఖార్జున్ మాట్లాడుతూ మీకు పరీక్షలు నిర్వహించడం చేతకాకపోతే కుర్చీ దిగిపోవాలని విమర్శించారు.

జీరోఅవర్ ప్రశ్నోత్తరాల చర్చలను కొనసాగించాలని కోరినా సభ్యులు వినలేదు. దీనితో సభ మూడు గంటలవరకూ వాయిదా వేసారు. బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో చర్చించిన అంశాలనే సభలో చర్చకు వస్తున్నాయని సభ్యులు సహకరించాలని అటు రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్, ప్యానెల్ స్పీకర్‌లు దిలీప్‌సైకియా, జగదాంబికా పాల్‌లు పదేపదే విజ్ఞప్తిచేసినా విపక్ష సభ్యులు తాజా సమస్యలపై చర్చకు రావాల్సిందేనని పట్టుబట్టడంతో సభ తొలిరోజు ఎలాంటి చర్చలులేకుండానే వాయిదాపడింది.

ఒకేసారి

>> రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం ఆగస్టులో ఇవ్వనున్నారు. వేసవికి ముందు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యం లబోధదారులకు ఒకేసారి పంపిణీ చేశారు. ఇక ఈ నెలకు సంబంధించి బియ్యం ఒకసారి ఇచ్చారు. మళ్లీ ఆగస్టులో మరో మారు మూడు నెలల కోటా ఇవ్వనున్నారు. ఈనెలకు సంబంధించిన రేషన్ కోటా పంపిణీ పూర్తి కావడంతో 20 నుంచి నెలాఖరులోగా జిల్లా పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలకు బియ్యం స్టాక్ పంపిస్తామని అధికారవర్గాలు తెలిపాయి. తెల్ల రేషన్ కార్డుకలిగిన వారికి కుటుంబ సభ్యుల తలసరి వినియోగం 6 కిలోల చొప్పున నెలకు ఇస్తారు. ఒక ఇంట్లో నలుగురు ఉంటే 24కిలోలు అందజేస్తారు. ఐతే 3నెలల కోటా 72 కిలోల బియ్యం ఒకే సారి ఇస్తారు. మూడు నెలల రేషన్ బియ్యంకోటా ఒకేసారి విడుదల చేస్తుండటంతో తమకు శ్రమ అధికమ వుతుందని రేషన్ డీలర్లు ఆవేదన చెందు తున్నారు.

డిజిపి ఆత్మహత్య

>> ఆయన తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు ప్రారంభమైందని అధికారులు తెలిపారు. కాగా, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధన్‌కర్ వృత్తిలో ఉన్నతంగా రాణించారు. పలు అవార్డులు గెలుపొందారు. అనురాగ్ మే 2025లో త్రిపుర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పోలీస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు త్రిపురలో డైరెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్)గా పనిచేశారు. అలాగే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సిబిఐలో విశిష్టమైన సేవలందించారు. తన పదవీకాలంలో అనేక కీలకమైన కేసుల దర్యాప్తును చేపట్టి అందరి మన్ననలు పొందారు.

వారం - వర్జ్యం

21-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
అష్టమి తె.5.17
చిత్త రా.8.52
వర్జ్యం : రా.2.59-తె.4.44
దు.ఉ.8.20-ఉ.9.12,
(2)రా.11.54-రా.12.46
రాహుకాలం - మ.3.00-4.30

వార్తాఫలం

మేషం: జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. నూతన కార్యక్రమాలలో తొందరపాటు వద్దు.

వృషభం: పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. స్పెక్యులేషన్స్ లాభించదు.

మిథునం: మీ గురించి మీరు శ్రద్ధ తీసుకోవడానికి మాత్రం సమయం సరిపోదు. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించండి.

కర్కాటకం : సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలలో పాల్గొంటారు.

సింహం: ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలు, అనుభవజ్ఞుల సలహాలు కూడా పాటించండి.

కన్య : తరచూ దూరప్రాంత ప్రయాణాలు చేయవలసి రావడం వలన శ్రమ, అలసట అధికమవుతాయి. బంధువుల కలయిక.

తుల : సన్నిహితుల నుండి అందిన సహచారం కొంత ఆందోళనకు గురి చేస్తుంది. వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి.

వృశ్చికం: మర్చిపోయిన విషయాలను జ్ఞప్తికి చేసుకొని వివాదాలకు దిగడం వలన ప్రయోజనం ఉండదని గుర్తించండి.

ధనుస్సు: అన్ని రకములైన పోటీ పరీక్షలకు అవసరమైనటువంటి వస్తువులను, వనరులను సమకూర్చుకుంటారు.

మకరం: పరిశ్రమలలో ఎదురైన ఆటంకాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు రావు.

కుంభం: కాంట్రాక్ట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం చెప్పదగినది. రాయభారములు నడిపి లాభపడుతారు.

మీనం : ఎంతగా వత్తిడి ఉన్నా గతంలో సోదర వర్గానికి మీరిచ్చిన మాట నిలబెట్టుకోగలుగుతారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

కాళేశ్వరాన్ని 'వేడెక్కిస్తున్న' ఎల్‌నినో

>> తరలిపోయినట్టు గణాంకాలే వెల్లడిస్తున్నాయి. జూన్ 1నుంచి 30వరకు రోజుకు సగటున 3,300 క్యూసెక్కుల వరద రాగా 10 టిఎంసిలు జలాలు జూన్ నెలలలో దిగువకు తరలిపోయాయి. అదే విధంగా జూలై 1నుంచి 9వ తేదీ వరకు 49.23 టిఎంసిలు కిందికి పోయాయి. దేవాదుల పంపులు కూడా ఆన్ చేయకపోవడంతో పట్టిసీమ,తాడిపూడి జలాశయాల నుంచి కృష్ణాడెల్టాకు నీటిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తరలించి సద్వినియోగం చేసుకొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగు,తాగునీటికి ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకొంటున్నారు. ఆలమట్టి,తుంగభద్ర నుంచి కృష్ణానది వరద రాకపోయినా ఆంధ్రప్రదేశ్ పాలకులు ఈ సీజన్‌లో 28టిఎంసి నీటినిగోదావరి నుంచి తరలించుకొని పోయి పులిచింతల వద్ద నిల్వచేసుకొని అక్కడి ప్రజలకు భరోసా ఇవ్వడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాన గోదావరిలో వరదలేకపోవడంతో ఎస్ఆర్ఎస్పి, కడెం,ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం ఇసుక ఎడారిలా జలాశయాలు మారిపోయాయి. ఉత్తర తెలంగాణ వరప్రదాయని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 80.5 టిఎంసిలకుగాను ప్రస్తుతం 15.049 టిఎంసిలనీరు మాత్రమే అందులో ఉంది. గత సంవత్సరం ఇదే సమయానికి ఈ ప్రాజెక్టులో 20.90 టిఎంసిల నీటి సామర్థ్యంతో దిగులు లేకుండా ఉండేది . ప్రాణహిత నుంచి వస్తున్న వరద కారణంగా మేడిగడ్డ బరాజ్ వద్ద 9జులై ఉదయం 9గంటల వరకు 81వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. సుమారు 7 టిఎంసిల నీటి ప్రవాహం అక్కడ నుంచి కిందికిపోయింది. మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రస్తుతం నదీ ప్రవాహం 97మీటర్లుగా ఉన్న ఆరోజుల్లో కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా రోజుకు 2టిఎంసిలను ఎత్తిపోసుకొనే అవకాశం ఉండేదని రిటైర్డు ఇంజనీర్ శ్యాం ప్రసాద్ రెడ్డి వంటి వారు కూడా అభిప్రాయపడ్డారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎన్‌డిఎస్ఎ అధికారులు ఇచ్చిన సూచనల ప్రకారం దిగువ ప్రాంతాల భద్రత రీత్యా నీటిని ఎత్తిపోసే సాహసం చేయలేకపోయారు. భద్రాచలం నుంచి మొదలుకొని 44 వూళ్లు కొట్టుకొని పోయే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఆందోళన చెందారు. మేడిగడ్డ కుంగుబాటుపై ఎన్‌డిఎస్ఎ సూచనల మేరకు నీటిని నిలపకుండా కిందికి వదిలివేస్తుండటంతో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుతో అనుసంధామైన ప్రాజెక్టుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. అన్ని ప్రాజెక్టుల్లో నీటి సామర్థం దాదాపు డెడ్‌స్టోరేజీకి చేరుకుంటున్నది. ఎల్లంపల్లి తరువాత అత్యంత కీలకమైన మధ్యమానేరు జలాశయం కూడా నీరు లేకపోవడంతో ఎడారిని తలపిస్తున్నది. ఎంఎండికి రెండో నీటి వనరు శ్రీరాంసాగర్ వరదకాలువ నుంచి నీటిని విడుదల చేసే పరిస్థితి కూడా లేదు. ఈ ప్రాజెక్టు పూర్తి స్థామర్యం 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.44 టిఎంసిలతో డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నది. మధ్యమానేరు ప్రాజెక్టు నుంచి ఎగువకు అంటే కొండపోచమ్మ ప్రాజెక్టు వరకు నీటిని ఎత్తిపోయాలంటే ముందుగా అన్నపూర్ణ రిజర్వాయర్‌కు వెళ్లాలి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో ఉన్న ఈ రిజర్వాయర్ సామర్థం 3.5 టిఎంసిలు కాగా, ప్రస్తుతం ఉన్న నిల్వ 1.45 టిఎంసిలు మాత్రమే నీటినిల్వలు ఉన్నాయి. అన్నపూర్ణ రిజర్వాయర్ నిండితే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌కు అక్కడి నుంచి ఎగువమానేరు నీటిని నింపుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దిగువమానేరు జలాశయం ప్రస్తుతం 5.58 టిఎంసిలు నీటిని కలిగి ఉండి దాదాపు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. తెలంగాణ వ్యాప్తంగా కృష్ణా,గోదావరి బేసిన్‌లోని ప్రధాన ఎనిమిది ప్రాజెక్టులోనూ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

5.5లక్ష క్యూసెక్కుల వరద నీరు ఉంటేనే పంపులు నడపడం సాధ్యం. 16వేల క్యూసెక్కుల వరదనీటిలో పంపులు ఆన్ చేస్తే పంపులు దెబ్బతింటాయి. 5.5లక్షల క్యూసెక్కుల వరద నీరు ఉంటేనే పంపులు నడపడం సాధ్యమని ఇంజనీరింగ్ అధికారులు నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం ప్రాణహితకు వస్తున్న వరద ఆధారంగా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను నడిపించలేమని, ఒక్కసారి మోటార్‌ను ఆన్ చేయగానే అక్కడ నీళ్లన్నీ ఖాళీ అవుతాయని, ఆ తర్వాత నీరందక పంపులు దెబ్బతినే అవకాశం ఉంటుందని నిపుణులు, ఇంజనీర్లు హెచ్చరిస్తున్నారు. ప్రాణహిత నుంచి వరద పోతుందని, మేడిగడ్డ బ్యారేజీ గేట్లు మూయకుండానే పంపింగ్ చేయవచ్చని బిఆర్ఎస్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం ఉందా? అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిపుణుల అభిప్రాయం స్వీకరించారు. ఇంజనీర్లు సాధ్యంకాదని తెలిపారు. ప్రస్తుతం ప్రాణహితలో 16 వేల క్యూసెక్కుల వరద మాత్రమే వస్తుందని, ఈ వరదతో పంపింగ్‌కు ఏ మాత్రం అవకాశాల్లేవని మంత్రికి వివరించారు. ఈ పంపులు నడిపించడం కంటే ముందు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూసి, నీటి నిల్వ కోసం జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నీటి నిల్వ చేయడం కూడా ప్రస్తుత పరిస్థితిలో వీలు కాదు. ఎందుకంటే ఎన్‌డిఎస్ఎ నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం బ్యారేజీల్లో పరీక్షలన్నీ పూర్తయినందున వాటి ఫలితాల కోసం వేచి చూస్తున్న కీలక సమయం ఇది. ఫలితాలు వచ్చాక వాటి ఆధారంగా పునరుద్ధరణ డిజైన్లు సిద్ధం చేయించి, ఆ డిజైన్లను కేంద్ర జలవనరుల సంఘం, ఎన్‌డిఎస్ఎ నిపుణులతో మదింపు చేయించుకోవాల్సిన ఒక కీలక ఘట్టంలో ఉన్నాం.ఇప్పుడు ప్రాజెక్టు పరిస్థితికి భిన్నంగా ఏ మార్పులు చేసినా ఆ తర్వాత పునరుద్ధరణ పనులు చేయడానికి నిర్ణయాలు తీసుకోని పరిస్థితి ఉంటుంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయని, ఆ సీపేజీలకు గ్రౌటింగ్ చేయకుండా నీటి నిల్వ సురక్షితం కాదని అధికారులు అంటున్నారు. అన్నారం బ్యారేజీ సామర్థం 10.87 టిఎంసిలుగా 2020లో 33, 34, 44 వెంట్‌ల వద్ద సీపేజీలు కనిపించాయని, మళ్లీ 2023లో 28, 38 వెంట్‌ల వద్ద సీపేజీలు ఏర్పడ్డాయని నీటిపారుదలశాఖ ఇంజనీర్లు చరిత్రను వివరించి భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు.

సుందిళ్ల బ్యారేజీ సామర్థం 8.83 టిఎంసిలు ఉంటుంది. 33, 46, 50, 52 బే లలో సీపేజీలు ఏర్పడ్డాయి, రెండు బ్యారేజీల్లో నీటి నిల్వకన్నా ముందు సీపేజీలు రాకుండా గ్రౌటింగ్ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుత వరదతో పంపింగ్‌కు అనుకూలత లేదని, మోటార్లు నడిపితే పంపులు దెబ్బతింటాయని, హెడ్ తగిలేలా నీటిని నిల్వ చేస్తేనే తగినంత పంపింగ్‌కు అవకాశం ఉంటుందని ఇంజనీర్లు అంటున్నారు. ఎన్‌డిఎస్ఏ అనుమతి లేకుండా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూయడం, నీటిని నిల్వ చేయడం మంచిదికాదనే అభిప్రాయంతో ఉన్నారు. ఏదీ ఏమైనా భిన్న భావనాలతో గోదావరి కిందికి తరలిపోతూనే ఉన్నాయి.

మరమ్మతులకు రంగం సిద్ధం

>> ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు.నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యుపిఆర్ఎస్), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జిఆర్ఐ) వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు.ప్రాథమిక అంచనాల ప్రకారం దయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్‌డిఎస్ఏ), కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు.పునరుద్ధరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజనీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందీ బిఆర్ఎస్ ప్రభుత్వం అని, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణం కూడా బిఆర్ఎస్సేనని ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ పార్టీ బురద జల్లడం, అధికారులను బలిపశువులుగా చూపించడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం చేస్తుందని మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ప్రస్తుతం నిర్మాణపరంగా సురక్షిత స్థితిలో లేవని ఎన్‌డిఎస్ఏ స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, వెంటనే కన్నెపల్లి పంపులను నడిపి వాటిలో నీటిని నిల్వ చేయాలని బిఆర్ఎస్ డిమాండ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ఆయనహెచ్చరించారు. 2023, అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన సమయంలో సీఎం కేసీఆర్ ఉన్నారని, అప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేదని గుర్తుచేశారు. 2023, డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే నాటికే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని గుర్తుచేశారు. 2019లో ప్రారంభించిన కొద్ది కాలానికే మేడిగడ్డ బ్యారేజీలో లీకేజీలు, సీపేజ్, నిర్మాణపరమైన లోపాలు బయటపడినా క్షేత్రస్థాయి ఇంజినీర్లు పలుమార్లు హెచ్చరించినా బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, నాణ్యత నియంత్రణలో వైఫల్యం, నిరక్ష్య ధోరణి కారణంగానే చివరికి బ్యారేజీ కుంగిపోయిందన్నారు. బ్యారేజీ కుంగిన మూడు రోజులకే ఎన్‌డిఎస్ఏ పరిశీలించి సమర్పించిన నివేదికలో రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ, నాణ్యత నియంత్రణ, భూగర్భ పరిశోధనలు, డ్యాం భద్రతా ప్రమాణాల అమలులో తీవ్ర లోపాలున్నాయని స్పష్టంగా పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. ఇలాంటి అధికారిక నివేదికలను పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు.

సోమవారం న్యూఢిల్లీలో కాక్రోచ్ పార్టీ ఆందోళనల్లో పాల్గొన్న వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి

కిషన్ రెడ్డితో అసోం సిఎం భేటీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై20: అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అస్సాం రాష్ట్రానికి సంబంధించిన బొగ్గు, గనుల రంగం అభివృద్ధి, ఇతర అంశాలపై ఇరువురు నేతలు వి

తన జెర్సీని డిజిపి ఆనంద్‌కు బహూకరించిన టీమీండియా క్రికెటర్ మహమ్మద్ సిరాజుద్దీన్. చిత్రంలో పోలీసు క్రీడలు, పిఅండ్ఎల్ ఐజి గజారావుభూపాల్ తదితరులు

డిజిపి ఆనంద్‌తో టీమీండియా క్రికెటర్ సిరాజుద్దీన్ భేటీ

డిజిపికి జెర్సీ బహూకరించిన మియాభాయ్

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: టీమీండియా క్రికెటర్ మహమ్మద్ సిరాజుద్దీన్ సోమవారం డిజిపి సి.వి. ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీసు శాఖలో డిఎస్‌పిగా పనిచేస్తున్న సిరాజుద్దీన్ టీమీండియాలో తన పేరిట వున్న జెర్సీని ఈ సందర్భంగా డిజిపి ఆనంద్‌కు బహూకరించారు. టీమిండియాలో సిరాజుద్దీన్ మరింత ఉన్నతంగా రాణించాలని డిజిపి ఆశాభావం వ్యక్తం చేయ డంతో పాటు సిరాజుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో పోలీసు క్రీడలు, పి అండ్ ఎల్ ఐజి డాక్టర్ గజారావు భూపాల్‌తో పాటు క్రీడ ల విభాగం డిఎస్‌పి రమణరావు కూడా పాల్గొన్నారు.

రేపు ఇంజినీరింగ్ రెండోవిడత సీట్ల కేటాయింపు

60,792 మంది వెబ్‌ఆప్షన్లు.. అందుబాటులో 31,834 సీట్లు

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. గడువు ముగిసే సమయానికి 60,792 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొత్తం 26,55,669 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రేపు(బుధవారం) రెండో విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రంలో 175 కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 81,620 సీట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. అనంతరం శనివారం రెండో విడత కౌన్సెలింగ్‌లో అదనంగా 4347 సీట్లకు అనుమతిస్తున్నట్టు ప్రకటించారు. మొదటి విడతలో 19,325 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయలేదు. దాంతోపాటు మొదటి విడతలో మిగిలిపోయిన 8162 సీట్లతో కలిపి మొత్తం 27,487 సీట్లు రెండో విడతలో కౌన్సెలింగ్‌కి అందుబాటులో ఉన్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ ఈ నెల 16న ప్రకటించారు. కొత్తగా 17 బ్రాంచ్‌ల్లో అదనంగా 4347 సీట్లకు అనుమతించగా.. వాటితో కలిపి రెండో విడతలో 31,834 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

లాసెట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు గడువు 28 వరకు పొడిగింపు

31 వరకు వెబ్‌ఆప్షన్లు.. 5న మొదటి విడత సీట్ల కేటాయింపు

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: రాష్ట్రంలో మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ లాసెట్‌కి సంబంధించిన కౌన్సెలింగ్‌లో భాగంగా కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి గడు వును ఈ నెల 28 వరకు పొడిగించారు. మొదట ఈ నెల 10 వరకు ఉండగా.. దానిని కాస్త ఈ నెల 20 వరకు పొడిగించగా.. ఇపుడు మరోసారి ఈ నెల 28 వరకు పొడిగించారు. మూడు సంవత్సరాలు, ఐదు సంవత్సరాల లా కోర్సులకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్కాన్ చేసిన సర్టిఫికేట్ల అప్‌లోడింగ్ ప్రక్రియను ఈ నెల 28 వరకు కొనసాగించనున్నట్టు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనం తరం కౌన్సెలింగ్‌కి అర్హులైన అభ్యర్థుల జాబితాను ఈ నెల 28న ప్రకటిస్తారు. ఈనెల 28 నుంచి 31 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 1న మొదటి విడత వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఆగస్టు 5న మొదటి విడతసీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు ఆగస్టు 6 నుంచి 10 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ పాండురంగారెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రంలో అరుదైన ఖనిజాలు

335.50 హెక్టార్ల విస్తీర్ణంలో నిల్వలు

15.25 మిలియన్ టన్నుల వెనేడియం

87 మిలియన్ టన్నుల అల్యూమినస్ లేటరైట్ నిక్షేపాలు

నిర్ధారించిన కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: తెలంగాణ పారిశ్రామిక రంగానికి సరికొత్త జవసత్వాలునిచ్చేలా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కీలక ఖనిజ నిల్వలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో భారీ ఎత్తున అరుదైన ఖనిజ నిక్షేపాలు బయటపడ్డాయి. జిల్లాలోని మొగుడంపల్లి మండలం, రాయిపల్లి తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని పర్వతాపూర్ శివారులో ఈ అరుదైన నిక్షేపాలు ఉన్నట్లు కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడి సర్వే నంబర్ 5 నుండి 48 వరకు ఉన్న సుమారు 800 ఎకరాలకు పైగా ప్రభుత్వ, పట్టా భూముల్లో నిపుణులు పలుమార్లు క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి ఈ అన్వేషణను విజయవంతం చేశారు. నిపుణుల తుది నివేదిక ప్రకారం, ఈ పర్వతాపూర్ బ్లాక్‌లోని మొత్తం 335.50 హెక్టార్ల విస్తీర్ణంలో అత్యంత విలువైన ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఇందులో సుమారు 15.25 మిలియన్ టన్నుల వెనేడియం, అలాగే 87 మిలియన్ టన్నుల అల్యూమినస్ లేటరైట్, టైటానియం నిక్షే పాలు ఉన్నట్లు అధికారులు లెక్కగట్టారు. భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానానికి వెన్నెముకగా నిలిచే ఇటువంటి అరుదైన ఖనిజాలు తెలంగాణలో ఈ స్థాయిలో లభించడం ఒక మైలురాయిగా భావిస్తున్నారు. ఇక్కడ లభించే ఖనిజాలు దేశ రక్షణ, సాంకేతిక రంగాలలో విప్లవాత్మక మార్పు లకు దోహద పడనున్నాయి. ఇక్కడ దొరికే వెనేడి యం ప్రధానంగా స్టీల్ (ఉక్కు) తయారీలో నాణ్య తను, బలాన్ని పెంచేందుకు మిశ్రమ లోహంగా ఉపయోగిస్తారు. అంతేకాకుండా, గ్రీన్ ఎనర్జీలో భాగమైన ఎలక్ట్రిక్ వాహ నాల (నిజు) బ్యాటరీలు, భారీ ఇంధన నిల్వ సామర్థం గల గ్రిడ్ బ్యాటరీల తయారీలో ఇది ఎంతో కీలకం. అలాగే అల్యూమినస్ లేటరైట్, టైటానియం నిక్షేపాలను డిఫెన్స్ (రక్షణ) రంగం, మిలిటరీ ఆయుధాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు (విమానాలు),అంతరిక్ష పరిశోధ నల్లో వాడే రాకెట్ల తయారీలో విస్తృతంగా వినియోగిస్తారు. ఈ ఖనిజ నిక్షేపాలను వేగంగా వెలికితీయడంతోపాటు ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ చొరవ చూపుతున్నట్లు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

పోలీసుల సంక్షేమానికి పలు పథకాలు

సంక్షేమం, ఆరోగ్య భద్రతపై అధికారులతో సమీక్ష జరిపిన డిజిపి ఆనంద్

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: పోలీసు శాఖలో ఆయా విభాగాల పనితీరును వరుసగా సమీక్షిస్తున్న డిజిపి సి.వి.ఆనంద్ సోమవారం సంక్షేమం, ఆరోగ్య భద్రత సహా పోలీసులకు అమలవుతున్న పథకాలపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. శాంతిభద్రతల డిజి మహేష్‌భగవత్, పిఅండ్ఎల్ గజారావు భూపాల్‌సహా ఇతర అధికారులు పాల్గొన్న సమావేశంలో డిజిపి ఆనంద్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించేందుకు అమలవుతున్న పథకాలు సవ్యంగా అందాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల్లో ఎక్కడా అవకతవకలు జరగకూడదని, పోలీసు సిబ్బంది పిల్లలలో ప్రతిభను ప్రోత్స హించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోలీసు సిబ్బందికి వివాహ, వైద్య, విద్య రుణాలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు, అదనపు కార్పస్ ఇన్సూ రెన్స్, వివిధ గ్రాంట్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా సమగ్ర ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు డిజిపి వివరించారు. దీంతో పాటు ఆరోగ్య భద్రత పథకం ద్వారా వేలాది మందికి వైద్యసేవలు అందిస్తున్నామని ఆయన అన్నారు. గ్రూప్ యాక్సిడెంటల్ ఇన్సూ రెన్స్‌తో కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ పథకం కింద కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు ఐదు లక్షల రూపాయలు. ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లకు 10 లక్షల రూపాయలు. డిఎస్ పిలకు 15 లక్షల రూపా యలు, ఎస్‌పి అంతకు పైస్థాయి అధికారులకు 25 లక్షల రూపాయల బీమా రక్షణ అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంక్షేమ నిధుల బలోపేతానికి పోలీసు క్యాంటీన్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు తదితర వనరుల ద్వారా వచ్చే ఆదాయాన్ని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్, పోలీసు పిల్లల విద్య, సివిల్స్, గ్రూప్స్ కోచింగ్, స్కాలర్‌షిప్‌లు, వివాహ సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలని ఆయన ఆదేశించారు. వెల్ఫేర్ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొం దించాలని, హోదాల వారీగా వెల్ఫేర్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు డిజి సంజయ్ జైన్, మల్టీ జోన్ 2 ఐజీ షా నవాజ్ ఖాసింతోపాటు పోలీస్ వెల్ఫేర్, ఆరోగ్య భద్రత కార్యదర్శి ఉదయ్ కుమార్‌రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు గోపీరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి

పార్లమెంట్ మార్చ్ చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతి యుతంగా పార్లమెంట్‌వైపు మార్చ్ నిర్వహించిన విద్యార్థులు, యువజన సంఘాలపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత దురదృష్టకరమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే, వారి గొంతును అణిచివేయడానికి బల ప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రశ్నించిన వారిపై లాఠీలు ఎత్తడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవక తవకలు, పేపర్ లీకేజీ ఘటనలతో లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, ఈ వ్యవహారానికి రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ పరిస్థితిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మౌనం ఎందుకు వహిస్తు న్నారని ప్రశ్నించారు. యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉందన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని నిర్ధారించేలా కేంద్రం తక్షణచర్యలు చేపట్టాలని మంత్రి పొన్నండిమాండ్ చేశారు.

అనుభవజ్ఞులైన నర్సులకు విదేశాల్లో భారీగా అవకాశాలు

రాష్ట్రవ్యాప్తంగా శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలకు కట్టుబడిన సర్కారు

టామ్‌కామ్-గ్లోబల్ నర్స్‌ఫోర్స్ మధ్య మంత్రి వివేక్ సమక్షంలో అవగాహన ఒప్పందం

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: జర్మన్ ఇంగ్లీషు వంటి భాషలలో నైపుణ్యం కలిగిన అనుభవం కలిగిన నర్సులకు మంచి ఉపాధి అవకాశాలు విదేశాల్లో ఉన్నాయని కార్మికగనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణకు చెందిన అనుభవజ్ఞులైన నర్సులకు విదేశాల్లో భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నర్సులను గుర్తించి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ అందించి, టామ్‌కామ్ ద్వారా విదేశాలకు పంపించే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ, గ్లోబల్ నర్స్ ఫోర్స్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం రాష్ట్ర శక్తి గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూరప్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో నైపుణ్యం కలిగిన భారతీయ నర్సులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు. ఆ అవకాశాలను తెలంగాణ యువతకు అందించేందుకు ప్రభుత్వం టామ్‌కామ్ ద్వారా సమగ్ర కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.

అర్హులైన నర్సులను గుర్తించడం, ఇంటర్వ్యూలు నిర్వహించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ అందించడం, విదేశీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టామ్‌కామ్-గ్లోబల్ నర్స్ ఫోర్స్ భాగస్వామ్యంతో నర్సులకు విదేశీ ఉద్యోగాలకు అవసరమైన జర్మన్‌తో పాటు ఇతర విదేశీ భాషల శిక్షణ, క్లినికల్ కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, వీసా, లైసెన్సింగ్, ప్లేస్‌మెంట్ తదితర అంశాల్లో సమగ్ర సహకారం అందించనున్నట్లు మంత్రి తెలిపారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇతర దేశాల్లో నాణ్యమైన ఉద్యోగ అవకాశాలను కల్పించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ ఉపాధి కార్యక్రమాలు తెలంగాణ యువతకు మాత్రమే కాకుండా ఆతిథ్య దేశాల ఆరోగ్య రంగ అవసరాలకు కూడా తోడ్పడే విధంగా ఉండాలని మంత్రి అన్నారు. అభ్యర్థులకు అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ అందించాలని, అంతర్జాతీయ ఆరోగ్య రంగ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని గ్లోబల్ నర్స్ ఫోర్స్ ప్రతినిధులను కోరారు.

శిక్షణ, నియామకాల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయని, అనుభవజ్ఞులైన నర్సులతో పాటు కొత్తగా పట్టభద్రులవుతున్న యువత కూడా విదేశీ ఉద్యోగాలపై ఆసక్తి చూపడం సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ నైపుణ్యాన్ని ప్రపంచ ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే విశ్వసనీయ వేదికగా టామ్‌కామ్ ఎదుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐఏఎస్, టామ్‌కామ్ జనరల్ మేనేజర్ , గ్లోబల్ నర్స్ ఫోర్స్ ప్రతినిధి పరమానంద సంత్రా తదితరులు పాల్గొన్నారు.

జంతర్ మంతర్‌లో విద్యార్థుల అరెస్టుపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

ఒకరోజు దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ

ప్రారంభమైన కాసేపటికే అరెస్టు చేసిన పోలీసులు

విద్యార్థులపై లాఠీచార్జీని ఖండించిన ఎఐఎస్ఎఫ్

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, ఎన్‌టిఏ వైఫల్యాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లతో విద్యార్థులు, యువత చేపట్టిన ధర్నాలో విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీ చార్జ్ చేయడంపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. విద్యార్థులు అక్రమ అరెస్టులను ఖండిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సుందరయ్య విజ్ఞాన కేంద్రం దగ్గర 24 గంటల దీక్షను ప్రారంభించింది. దీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే పోలీసులు అడ్డుకొని దీక్షలో పాల్గొన్న విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, విగితి వైఫల్యాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విగితి రద్దు వంటి డిమాండ్లతో విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలకు దేశవ్యాప్తంగా మద్దతుగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దగ్గర ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరహార దీక్షను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ప్రారంభించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని యువత, విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి మద్దతు పెరుగుతున్న వేళ, తెలంగాణలో ఆ ఉద్యమాలకు సంఘీభావంగా శాంతియుత నిరాహార దీక్ష నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఉద్యమాలను అణచివేయడానికి పోలీసులను ఉపయోగించడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరహార దీక్ష ప్రారంభించిన సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ నీట్, సీయుఈటీ వంటి పరీక్షల నిర్వహణలో తలెత్తిన తీవ్రమైన సమస్యలు, ఎన్‌టిఏపై విశ్వాస సంక్షోభం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి చర్యలు తీసుకోవాల్సింది పోయి మౌనంగా ఉండడం దారుణమన్నారు. విద్యార్థుల ప్రాణాలు పోయినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అమానుషమఅన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యా ర్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమా నుషమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు.

పూర్తిస్థాయి పనిలేదు.. సగం జీతమే ఇవ్వండి!

విధుల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంది

యుపి ప్రభుత్వానికి ఓ ఐఎఎస్ లేఖ

జలౌన్(యుపి), జులై 20: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ యువ ఐఎఎస్ అధికారి రాసిన లేఖ తీవ్రచర్చకు దారి తీసింది. తనకు పూర్తిస్థాయిలో పని లేకపోవడంతో సగం జీతమే చెల్లించాలని, లేదంటే నిబంధనల ప్రకారం పనిచేసే అవకాశమున్న చోటుకు బదలీ చేయాలని కోరుతూ రాష్ట్ర నియామక, సిబ్బంది శాఖకు ఐదు పేజీల లేఖ పంపారు. ప్రస్తుతం ఎస్‌డీఎం (జ్యుడీషియల్)గా పని చేస్తున్న 2023 బ్యాచ్ ఐఎఎస్ అధికారి రింకూసింగ్ రాహీ ఈ విజ్ఞప్తి చేశారు. ఇపుడు తన బాధ్యతల్లో రోజుకు నాలుగు గంటల పనిమాత్రమే ఉంటోందని రాహీ లేఖలో పేర్కొన్నారు. అందుకే ఈ పోస్టులోనే కొనసాగిస్తే సగం జీతం చెల్లించినా అభ్యంతరం లేదని తెలిపారు. అదే సమయంలో పరిపాలనా వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉందని ఆరోపిస్తూ మంత్రి స్వతంత్రదేవ్‌సింగ్, బీజేపీ ఎమ్మెల్యే గౌరీశంకర్‌వర్మ పేర్లను కూడా ప్రస్తావించారు. జలౌన్‌లో ఎస్‌డీఎంగా పనిచేసే సమయంలో అక్రమ భూకబ్జాలు, ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారాల్లో చర్యలు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ తనకు ఆదేశించారని రాహీ ఆరోపించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే గౌరీ శంకర్‌వర్మ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన జనతా దర్శన్ కార్యక్రమం కేవలం పేరుకే జరుగు తోందని, మూల సమస్యలను పరిష్కరించకుండా తాత్కాలిక చర్యలకే పరిమితమవుతోందని విమర్శించారు. నిబంధనల ప్రకారం స్వేచ్ఛగా పని చేసే అవకాశం ఉన్న మరో తహసీల్‌కు లేదా మరో జిల్లాకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని రాహీ కోరారు. అది సాధ్యం కాకపోతే మరో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై పంపాలని కూడా విజ్ఞప్తి చేశారు.

బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ రాజీనామా

కొత్త ప్రధానిగా ఆండీబర్న్‌హామ్

లండన్, జులై 20: బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్ అధికారికంగా నియమితులయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోరుతూ కింగ్ ఛార్లెస్ ఇవాళ ఆయన్ను స్వాగతించారు. కింగ్ ఛార్లెస్ ఆఫర్‌ను బర్న్‌హామ్ స్వీకరించారు. బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో అపాయింట్ తర్వాత ఛార్లెస్ చేతిని బర్న్‌హామ్ ముద్దాడారు. బ్రిటన్ 59వ ప్రధానిగా బర్న్‌హామ్ నియమితులయ్యారు. బర్న్‌హామ్ రాకకు ముందు బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి మాజీ ప్రధాని కీర్ స్టార్మర్ వెళ్లిపోయారు. గడిచిన నాలుగేళ్లలో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోయే నాలుగవ వ్యక్తిగా బర్న్‌హామ్ నిలవనున్నారు. తన తొలి ప్రసంగాన్ని ఆయన డౌనింగ్ స్ట్రీట్‌లో ఇవ్వనున్నారు. లేబర్ పార్టీ నేతగా బర్న్‌హామ్ నియమితుడైన విషయం తెలిసిందే. ఆయన తన విధానాల్లో భాగంగా ఆదాయపన్నును తగ్గించే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని కీర్‌స్టార్మర్ రాజీనామా చేశారు. ప్రిన్స్ కింగ్ ఛార్లెస్ 3కి తన రాజీనామా సమర్పించారు. అనంతరం 10 డౌన్‌స్ట్రీట్‌లో తన చివరి ప్రసంగం చేశారు. తాను ప్రధాని పదవి నుంచి సంతోషంగా వైదొలుగుతున్నట్లు స్టార్మర్ చెప్పారు. తన తర్వాత ఆండీ బర్న్‌హామ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఆండీకి మద్దతు ఇవ్వాలని తన సన్నిహితులను, బ్రిటన్ ప్రజలను స్టార్మర్ కోరారు. దీంతో ఆండీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు బ్రిటన్ ప్రధాని పదవి చేపట్టాల్సిందిగా కింగ్ ఛార్లెస్3 సోమవారం ఆండీ బర్న్‌హామ్‌ను ఆహ్వానించారు. ఆండీ ఈ వారమే ప్రధాని పదవి చేపట్టబోతున్నారు. అనంతరం ఆయన తన మంత్రివర్గాన్ని నియమించుకుని, పూర్తిస్థాయి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తూ బాధ్యతలు స్వీకరిస్తారు. లేబర్ పార్టీ తరఫున స్టార్మర్ తప్పు కోవడంతో ఆయన స్థానంలో ప్రధానిగా ఆండీని ఆ పార్టీ నియ మించింది. ఎలాంటి ఓటింగ్ లేకుదానే ఆయనను ప్రధానిగా ఎన్నుకున్నారు.

జానీ మాస్టర్‌పై జీవితకాల నిషేధం ఎత్తివేత

ఫిలిం ఎంప్లాయీస్ ఫెడరేషన్ నిర్ణయం

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: తెలుగు సినీ టీవీ డ్యాన్సర్స్ అసోసియేషన్ గొడవలు టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారాయి. ఈ వివాదం కారణంగా జానీ మాస్టర్‌పై తెలుగు ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ విధించిన లైఫ్ టైమ్ బ్యాన్‌ను ఎత్తివేస్తూ నిర్ణయించింది. సినీ డ్యాన్సర్స్ మధ్య ఏర్పడిన వివాదం కారణంగా జానీ మాస్టర్‌పై రెండు రోజుల క్రితం జీవిత కాలం నిషేధం విధిస్తూ తెలుగు ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. జానీ మాస్టర్ పనిచేస్తోన్న స

వార్త

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే గొప్ప సైన్యానికి మించిన శక్తి మనకి లభిస్తుంది.

- ఉడ్రోవిల్సన్

వణుకుతున్న 'ఉత్తరం'

ప్రకృతి విజృంభించినప్పుడల్లా అది ప్రకృతి ప్రకోపమా, మానవ తప్పిదమా అని ప్రశ్నించుకుంటూనే ఉంటాం. ప్రకృతి కళ్లెర చేస్తే చేయగలిగినదేమీ ఉండక పోయినా తగిన జాగ్రత్తలు తీసుకుంటే జనంఅప్రమత్తమై ఉంటే ఎంతో కొంత నష్టాలను తగ్గించుకోగలమనే అంశం దీనితో ముడిపడి ఉంది. ప్రస్తుతం ఉత్తరాదిన వరదలు ముంచెత్తుతున్నాయి. కనీవినీ ఎరుగని బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఉత్తరాఖండ్, నాగాలాండ్‌లలో ఆకస్మిక వరదలు చుట్టుముట్టాయి. జనజీవనం స్తంభించింది. జమ్మూ కాశ్మీర్‌లో భారీ వర్షాలతో అతలాకుతలం అయిపోయింది. ఆదివారం నాటి వరదలకే కనీసం 17 మంది దుర్మరణం పాలయ్యారు. ఎడతెగని వర్షాలతో రాజౌరి, పూంచ్, అనంతనాగ్ జిల్లాలో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరి నదులు పొంగిపొర్లాయి. రహదారులపై నీళ్లు చేరాయి. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి. రాజౌరి జిల్లాలోని దర్వాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమెలా నదులతోసహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోపక్క కొండచరియలు జారిపడుతున్నాయి. జనసంచారం ఎంత తక్కువగా ఉన్నా ఎక్కడో అక్కడ జన నష్టానికి చేరువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆదివారం నుంచి భక్తజన సందోహాన్ని ముందుకు కదలనీయకుండా ప్రభుత్వాలు ఆంక్షలు విధించారు. బేస్ క్యాంపుల్లో ఉన్న భక్తులను ఎక్కడికీ కదలనీయకూడదని ఆదేశాలు జారీ చేశారు. అమర్‌నాథ్‌తోపాటు ప్రఖ్యాత వైష్ణోదేవి అమ్మవారియాత్ర కూడా స్తంభించిపోయింది. తదుపరి ఆదేశాలు ప్రకటించే వరకు వీటిని పునరుద్ధరించలేమని ప్రభుత్వ అధికారులు నిర్ద్వంద్వంగా ప్రకటించారు. జమ్మూ, కాశ్మీర్‌ల మధ్య యాత్రికులను అటునిటు వెళ్లకుండా ఆంక్షలు విధించడంతో ఎక్కడికక్కడ బ్లాక్ అయిపోయారు. వారంతా జమ్మూ, ఉధంపూర్ రామ్‌బన్‌లలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాల వద్దే తలదాచుకోవాలి. బంగాళాఖాతం అరేబియా సముద్రాల నుంచి వస్తున్న తీవ్రతకు గాలుల ప్రభావంతో జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 23 వరకు కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. 21 నుంచి 23 వరకు కశ్మీర్‌లో అతి భారీ వర్షాలు పడవచ్చునని, 20 నుంచి 23 వరకు మధ్య జమ్మూ రీజియన్‌లోని రియాన్స్, ఉద్దంపూర్ జిల్లాలో రికార్డుల స్థాయి వానలు కురిసే పరిస్థితిఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అనంత నాగ్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, మేఘా విస్ఫోటనాలు, ఫ్లాష్‌ఫ్లడ్‌లతోపాటు, కొండచరియలు విరిగిపడ్డాయి. పూంచ్, సురన్‌కోట్‌లోని లోయర్ ముర్రాలో 10 మంది రాజౌరీలో ఇద్దరు చనిపోగా, ఆరుగురి ఆచూకీ దొరకలేదు. చిట్టర్గఉల్ ప్రాంతంలో సాయంత్రం 7 గంటల దాకా మేఘవిస్ఫోటనం సంభవించింది. జమ్మూకాశ్మీర్‌లకు ఇది మూడో మేఘ విస్ఫోటనం దెబ్బ. ఇటీవలనే కిష్ట్వార్‌లోని క్వార్ హైడ్రో ప్రాజెక్టు వద్ద దోడాలోని తత్రిలో కూడా ఇదే విధంగా క్లౌడ్‌బర్స్ట్ సంఘటనలు జరిగాయి. హిమాలయ ప్రాంతం పూర్తిగా ఫ్లాష్ ఫ్లడ్‌లకు అలవాటుగా మారింది. ప్రధానంగా విలయానికి కారణం ప్రభుత్వాల వైఫల్యం, మానవ తప్పిదాలు కూడా అనిచెప్పాలి. జమ్మూ కాశ్మీర్ అంటే అందాల లోయలే కాదు, ప్రకృతి సౌందర్యానికి ఆలవాలంగా ఉంటుంది. అలాంటి చోటప్రకృతిని కాపాడుకోవడం మనవంతు, ప్రభుత్వ బాధ్యత. ప్రకృతిని గౌరవించకుండా పర్వతాలపై దాడి చేస్తే ప్రకృతి పగబట్టినట్లుంటుంది. పర్యావరణాన్ని కాపాడుకోవడంలోవేసే ప్రతి నిర్లక్ష్యపుటడుగు మానవాళికి ప్రమాదమే. హిమాలయ ప్రాంతాల్లో నిర్మాణాలపై కఠిన నిబంధనలు, నదీ ప్రవాహ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడే విధాన నిర్ణయాలు, ప్రకృతి బీభత్సాల ముందస్తు సమాచారాన్ని గ్రామాలకు తక్షణమే చేరవేయడం వలన కొంత మేరకు నష్టాలను తగ్గించొచ్చు. అడవులను నరకడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలి. సుస్థిర పర్యాటకం కోసం ఇవన్నీ తప్పని సరి. లేకుంటే వర్షాకాలపు ప్రకృతి విపత్తులతో బహుళ స్థాయిలో నష్టాలు వాటిల్లుతాయి. ఇలా అనుకోని వరదలొచ్చినప్పుడు ప్రభుత్వపరంగా కొద్దిపాటి సంసిద్ధతలు సరిపోవు. వరద సమాచారం తెలియక జనం తల్లడిల్లిపోయిన సందర్భాల్లో వారిని ఆదుకునే ప్రత్యేక యంత్రాంగం ఏదీలేదనే చెప్పాలి. భారీయంత్రాలు ముందస్తుగానే ప్రమాద సూచిత ప్రాంతాలకు చేర్చాలి. లోయల్లోని గ్రామాలకు ప్రభుత్వ యంత్రాంగం చేరాలంటే చాలాసమయం పడ్తుంది. ఒకసారి వర్షానికి సమయం చిక్కితే నిరంతరం కురుస్తూనే ఉండడంవల్ల ప్రభుత్వ సాయం ఆలస్యంగా అందుతుంది. సహాయక చర్యలు ఎప్పుడైతే తక్షణమే అందవో అప్పుడే నష్టాలు ఎక్కువవుతున్నాయి. బాధితులకు తక్షణ ఆహారపొట్లాలు, లేదా సహాయం అందకపోతే వారి ఆక్రందనలకు అంతే ఉండదు. ఇప్పుడు కశ్మీర్‌లో ప్రకృతి విలయానికి సహాయం అందక ఎంతో మంది విలవిల్లాడుతున్నారు. అనంతనాగ్‌లో వరి పొలాలు, యాపిల్ తోటలు బాగా దెబ్బతిన్నాయి. రైతుకు ఆదాయం బాగా పోయేటట్లుంది. నిర్మాణాలు, అడవుల నరికివేత, సహజనీటి ప్రవాహ మార్గాలకు ఆటంకాలు, పర్యాటకులు పడేసిన చెత్తను సైతం తొలగించే ఏర్పాటు లేక పోవడం వల్లనే ప్రకృతితెచ్చే నష్టాలు ఎక్కువవుతున్నా యని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డా. మన్సా నిసార్ వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కేరళ రాష్ట్రం వయనాడ్ విలయం నాటి అనుభవాల గుణపాఠం నేర్చుకోవాలి. ప్రకృతి విలయాలను తట్టుకుని తక్షణ సహాయాన్ని పునర్నిర్మాణ పనులకు పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు అవసరం.

పొగిడేవారు లేనప్పుడు కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.

శామ్యూల్ జాన్సన్

ఎవడు మహాబలశాలి అయినప్పటికీ, కోమల హృదయం కలిగి ఉంటాడో, అతడే నిజమైన మానవుడు, ధీరుడు.

స్వామి వివేకానంద

ప్రజావాక్కు

ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు సగం జనరల్ బోగీలు వెయ్యాలి

వందే భారత్, వందే మాతరం రైళ్లు ఎవడు అడిగాడు? అన్నీ ఏసీ రైళ్లు వేస్తున్నారు. రైల్వే మంత్రికి ప్రజల సామాజిక పరిస్థితులు తెలుసా! సామాన్యుడు రైలు ఎక్కాలంటే యుద్ధం చేసినంత పని అవుతుంది. ప్యాసింజర్ రైళ్లు తీసేసి వాటిని ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చారు. ఒకటి రెండు జనరల్ బోగీలు వేస్తారు. బుద్ధి జ్ఞానం ఉందా ఆ అధికారులకు అన్న అనుమానం వస్తుంది. గతంలో కాకినాడ తిరుపతి ప్యాసింజర్ రైలు ఉండేది. తిరుపతి వెళ్లే వారికి అది చాలా అనుకూలంగా ఉండేది. ఇప్పుడు దాన్ని రద్దుచేసి ఎక్స్‌ప్రెస్ చేసి ఒకటి రెండు జనరల్ బోగీలు వేశారు. రైల్వే మంత్రిని ఈ జనరల్ బోగీల్లో ప్రయాణం చెయ్యమని చెప్పండి. ప్రయాణికుల బాధలు తెలుస్తాయి. కృష్ణ ఎక్స్‌ప్రెస్ కూడా మొదటిలో అన్ని జెనరల్ బోగీలు ఉండేవి. ఒకటి రెండు రిజర్వేషన్ ఉండేది. ఇప్పుడు అన్ని రిజర్వేషన్ చేసి, ఒకటో రెండో జనరల్ బోగీలు వేశారు. ప్రతి ఎక్స్‌ప్రెస్‌కు సగంజనరల్ బోగీలు వేయాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

కుటుంబ సభ్యులందరికి ఒకే చోట..

సర్ కొన్నిచోట్ల బీల్‌ఓ. తెలియకనో, చాదస్తమో, మరి యోంటోగాని ఫాం ఒకే కుటుంబం ఓటర్‌లిస్ట్ గతంలో తప్పులుగా నమోదుచేసి బిలేవోలు నేటికీ నాల్గురు నాలుగు పామ్ తీసుకువచ్చి మాకు ఇవ్వాలని అనడం వారి విధుల పట్ల వారికి ఎంతవరకు అవగాహన ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. ఇప్పటికైనా విషయంతెలుసుకొని వ్యవహరించాలి. తప్పుడు సమాచారం మిడిమిడి జ్ఞానంతో ఉండకూడదు. మీకే కదా పనిభారం తగ్గుతుంది. ఒకే కుటుంబంలోని ఓటర్ లిస్ట్ఒకే బూతులో ఉండాలి. గతంలోనీ తప్పులు వేరువేరు బూతులలో మళ్ళీ జరుగకుండా జాగ్రత్త తీసుకోవాల్సింది. ఎన్నికల కమిషన్ అధికారులు నమోదు చేసేవిధంగా ఉండాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

అదనపు టీచర్లను ఏర్పాటు చేయాలి

కరీంనగర్ జిల్లాలో ఉన్న ఎస్సీ సైనిక్ స్కూల్, వరంగల్ జిల్లాలో ఉన్న ఎస్టిసైనిక్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎక్కువ సిబ్బంది ఉండాలి. అన్ని టీచింగ్ సబ్జెక్టులతో పాటుగా జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, పోటీ పరీక్షలు ఆర్థిక సామాజిక విషయాలపై అవగాహన కోసం మిగులు టీచింగ్ సిబ్బందిని ఉపయోగించాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

రైతుల ఆదాయం పెంచాలి

కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు రైతులఆదాయం రెట్టింపు చేయాలి అని కోరికను వెళ్ళిబుచ్చుతూ ఉంటుంది. నిజమే రైతుల ఆదాయం రెట్టింపు చేయవలసిందేఅందులో సందేహం లేదు. కరోనా, యుద్ధ వాతావరణం సృష్టించిన సంక్షోభ పరిస్థితులు రైతులు ఆయిల్ ఫామ్‌వైపు వెళ్ళేట్టు చేసాయి. రైతులు ఆయిల్‌ఫామ్ ద్వారా కొంతపంట వైవిధ్యతను ఆదాయన్ని పొందుతున్నారు. ఉపాధి హామీ ద్వారా ఒక పిట్ తీసి అందులో మొక్క పెడితే దాని ద్వారా వచ్చేఆదాయం 33 రూపాయలు ఆలా ఎకరం స్థలంలో 1000 మొక్కలు పెడితే వచ్చే ఆదాయం ఎంతో మనమే ఊహించవచ్చు. అంత మాత్రమే కాదు వాటిని ఎకరం స్థలంలో పెట్టి కాపాడినందుకు నెలకు ఒక మొక్కకు 20 రూపాయల చొప్పున చెల్లించే ఈ అవకాశం రైతులు ఉపయోగించుకుంటే బాగుంటుంది. ఇలా చేస్తే రైతుల ఆదాయం పెరగడం మాత్రమే కాదు వారి జీవన ప్రమాణ స్థాయీ కూడా పెరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

ఉత్తీర్ణత శాతం పెంచాలి

పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెరగాలని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం కావడంతో ప్రతి సబ్జెక్టు టీచర్ ఒక్కో రోజు ఒక్కో స్టడీ అవర్ నిర్వహించవలసి వస్తూ ఉన్నది ఉదయము సాయంత్రం రెండు గంటలు అదనంగా పని చేయవలసి వస్తూ ఉన్నది. ఇలాంటి ఈ నేపథ్యంలో ప్రతి దానికి ప్రధానోపాధ్యాయుడు అనుమతి అవసరమైన సందర్భంలోప్రధానోపాధ్యాయుడు కూడా ఉదయము సాయంత్రం సదరు ఉపాధ్యాయునితో ఖచ్చితంగా ఉండేలాంటి నియమ నిబంధన ప్రభుత్వం ఎందుకు విధించడం లేదు? అతనిని బాధ్యుడిగా ఎందుకు చేయడం లేదు? భార్యాభర్తల అయిన వారు వేరువేరు పాఠశాలల్లో పని చేసినప్పటికీ ఒకే ఇంట్లో ఉంటారు. వారికి జీతభత్యాలతో పాటు ఇస్తున్నటువంటి ఇంటి అద్దె ఇద్దరికీ ఇవ్వడం ఎంతవరకు సమంజసం?

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

ఆకాశం వైపు అన్నదాత చూపు

జూలై మాసం గడుస్తున్న ఇంకా సరిపడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాగే ఉంటే అన్నదాతలు అప్పులపాలు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ పంటల పట్ల అవగాహన కల్పించాలి. రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

బిజెపి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

వైద్యం, విద్యే పాలకుల లక్ష్యం కావాలి

ఉచితంగా వైద్యం, విద్య అందుబాటులో ఉంచగలుగుతే అంతకు మించి ప్రజానీకానికి సంక్షేమ కార్యక్రమాలు ఏముంటాయి? రాజకీయాలు చేయటం ఎప్పుడూ అక్కరకు రావు! ఓట్లు పడుతేనే ప్రభుత్వంలోకి ఏ పార్టీ అయినా రాగలదు! కానీ ప్రజలను అన్ని రకాలుగా యోగ్యులుగా చేయగలిగే విధంగా అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించే సమయం వచ్చింది! ఎన్నికల్లో గెలవటమే ప్రధానం కాదు! ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు తర్వాత ప్రజలందరూ ఒకటే అన్న సమున్నత విధానాన్ని అమలు చేయగలుగుతే దీర్ఘ కాలిక ప్రయోజనాలు ప్రజాస్వామ్య పరిధిలో న్యాయంగా నిజాయితీగా ప్రజలకు సమకూర్చిన వారవుతారు! అం దుకనే 'విద్య'ను లక్ష్యంగా పెట్టుకొని గెలిచిన పార్టీ విద్యా ధికులను అభ్యున్నతి కోసం తయారు చేయాలి!

రావులపాటి సీతారాంరావు

రాజకీయాలు ఎట్లున్నా దేశంలో విద్యా విధానాన్ని సంస్కరించాల్సిన అవసరం ఏర్పడింది! అటు రాష్ట్ర ప్రభుత్వాలకూ ఇటు కేంద్ర ప్రభుత్వానికి విద్యావిధానంలో మార్పులు, చేర్పులు సంస్కరణలూ కాలానుగుణంగా చేసినప్పుడే విద్యకు విలువ నిచ్చినవారవుతారు. 'విద్య నొసగు వినయంబు'తో బాటు జీవనవిధానాన్ని నేర్పుతుంది! మాతృదేవో భవ, పితృదేవో భవలతో పాటు ఉపాధ్యాయుడికి సమాజంలో వున్న ఉన్నత స్థానాన్ని తెల్పటానికి, పూర్వీకులు గురువును కూడా తల్లీదండ్రులతో పాటు 'గురుదేవోభవ'ను చేర్చి విద్యనొసగే గురు స్థానానికి సముచిత రీతిలో సూక్తుల పరంగా గుర్తు చేయటం జరిగింది! విద్యను 7వ షెడ్యూలులో కంకరెంట్ లిస్టులో చేర్చటం వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్రానికి ఈ విషయంలో చట్టాలు చేసి సంస్కరించాల్సిన గురుతర బాధ్యత వుంది! పార్లమెంటు సమావేశాల్లో విద్య ప్రాముఖ్యతను ప్రజా ప్రతినిధులు గుర్తించి, డిబేట్లను చేపల మార్కెట్టు ధోరణిలో చేయకుండా అర్థవంతంగా పార్టీలకు అతీతంగా విద్యావిధానాలను అవసరమైతే సంస్కరించటానికి చట్టాలను పాస్ చేయాల్సిన బాధ్యత వుందని భావించటంలో తప్పులేదేమో! వైద్యం, విద్య ప్రజల అభ్యున్నతికి మూల స్థంభాల్లాంటివి! ఆ రెండింటిని ప్రైవేట్ పరం చేయటానికే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏ పార్టీ అధికారానికి వచ్చినా సరే, సిద్ధపడ్తుండటం దురదృష్టంగా భావించక తప్పదు. 'నీట్' పరీక్ష ఎంతోమందికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం కల్పించింది. సోనమ్ వాంగ్ చుక్ అనే విద్యావేత్త మార్పుల కోసం ప్రాణాన్ని ఫణంగా పెట్టి నిరాహార దీక్ష చేస్తున్నారు. కేంద్ర విద్యా మంత్రి రాజీనామా ఆయన డిమాండ్! వాంగ్ చుక్ను హాస్పిటల్కు తరలించారు! ఈ నేపథ్యంలో విద్యావిధానంలోని లొసుగులు, కావల్సిన మార్పులు విశ్లేషించుకోవాల్సిన సమయం ఆసన్నమయింది! విద్యను సాధ్యమైనంత త్వరగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి, సంస్థల నుంచి తొలిగించి ప్రభుత్వ పరిధిలోకి తీసుకొని రావాలి! గవర్నమెంట్ స్కూళ్ళను, కాలేజీలనే ప్రోత్సహించాలి! అప్పుడే ఒకే రకమైన విద్యను గరపటానికి, విద్యా విధానాలను పాటించటానికి అవకాశం వుంటుంది. నీట్ లాంటి సంస్థల్లో తప్పుల ప్రమాదం అదుపులో ఉంటుంది! బాధ్యతలు ఏకీకృతమవుతాయి! రాష్ట్ర ప్రభుత్వాలు గూడా ప్రైవేటు పరంగా విద్యను ఒప్పచెప్పకూడదు! బాధ్యతలు ప్రభుత్వాలు తొలగించుకొని, కేవలం కర్ర పెత్తనానికి, అధికారానికి మాత్రమే పరిమితమవుతే అంతే సంగతులు! ఆచరణ మొదట్లో కష్టమే అయినా, స్వాతంత్ర్యం వచ్చిన కాలంలో మన దేశంలో విద్య ప్రయివేటు వారి చేతుల్లో చాలా తక్కువగా వుండేది. ప్రయివేట్ స్కూళ్ళల్లో, విద్యాలయాల్లో చదువుకున్న వారిని ఆరోజుల్లో చిన్నచూపు చూసేవారు! కోచింగ్ కల్చర్ను పూర్తిగా తొలిగించాలి! కోచింగ్ల పేరుతో బలవంతంగా విద్యార్థులపై ఒత్తిడిని ప్రయివేట్ కోచింగ్ సెంటర్లు అమితంగా పెంచుతున్నాయి! అంతేగాదు ఒకరి కంటే మరొకరు మిన్న అని నిరూపించుకోటానికి అనేక రకాల మార్గాలను అన్వేషించటం మొదలుపెట్టారు! దీనితో మార్కులు ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులు తెచ్చుకుంటు

న్నారు కానీ, నాలెడ్జి పరంగా వారిలో సాధించేది దాదాపు సున్నాగా మిగులుతుంది. తల్లిదండ్రులు కోచింగ్ కోసం డబ్బులు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు! ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్లు విద్యార్థులు ఎదగటానికి బదులు కేవలం మార్కుల కోసం జరుగుతున్న యుద్ధంగా మారింది! చాటుమాటుగా కోచింగ్ ఇచ్చేవారు పరీక్షలల్లో వచ్చే క్వశ్చన్ పేపర్లు నిజమైన పేపర్లుగా నమ్మబలికి వారి అనుయాయులతో పరీక్ష ఇచ్చే విద్యార్థులకు నమ్మించి డబ్బు చేసుకుంటున్నారన్న వదంతులు గూడా వున్నాయి! కొన్నిచోట్ల ఆ గెస్ పేపర్లు నిజమైన పేపర్లుగానే బయటపడి రభసగా మారటంతో పరీక్ష రాసిన వారందరికీ భయాందోళనలు కలిగించాయి. ప్రభుత్వాలకు తలవొంపులు గూడా తెచ్చాయి! అందుకనే కోచింగ్ సెంటర్లను నియంత్రించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి! నిజమైన విద్య ఎప్పుడు అబ్బుతుందంటే నిష్ణాతులైన అధ్యాపకులు బోధించినప్పుడే! అందుకనే ప్రభుత్వ విద్యాలయాలలో అసలు సిసలైన, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి విద్యార్థులను నిజమైన విద్యావంతులుగా మార్చే ప్రయత్నం చేయక తప్పదు! ద్రోణాచార్యులు, సాందీపుడు లాంటి ఆచార్య శ్రేష్ఠులు దొరకక పోవచ్చు కానీ ఈ ఆధునిక యుగంలో మన దేశంలో ఎందరో మెరికల్లాంటి టీచర్లు వున్నారు! వారి అవసరం, వారు అందుబాటులో వుండే విధంగా తీర్చి వారిని నియమించగలుగితే విద్యార్థుల నిజమైన ప్రతిభను వెలికి తీసిన వారవుతారు! ఉద్యోగాలే లక్ష్యంగా వున్నా నైతికంగా విద్య వల్ల శ్రేష్ఠమైన విజ్ఞానం సంపాదించటం వల్ల విద్యార్థిలోకం పరిపూర్ణ విజ్ఞతతో భాసిల్లి యువకులుగా మారి, దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా అన్ని రంగాలలో ఆరితేరిన రీతిలో ప్రభుత్వాలకు అందుబాటులో ఉంటారు! ఆ మార్గంలో చర్యలు తీసుకోవాలి! విద్యాలయాలలో టీచర్ల ఉద్యోగాలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి! ఒక పాఠ్యాంశం బోధించే ఉపాధ్యాయుడికి మరో అంశం బోధించే పని లేకుండా జాగ్రత్తలు ప్రభుత్వాలు ఏర్పరిచినప్పుడే సరియైన ఫలితాలు వస్తాయి! లేబరేటరీస్, లైబ్రరీలు, ఆట స్థలాలు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పరిశుభ్ర పరిసరాలు, కనీసం ఒక స్థాయిలో వుండే విధంగా తీర్చిదిద్దినప్పుడు (ప్రతి విద్యాలయంలో) పిల్లలకు ముఖ్యంగా ప్రైమరీ స్థాయి వారికి చదువంటే ప్రేమ ఏర్పడుతుంది. ఆకర్షణీయంగా విద్యావిధానాన్ని రూపుదిద్దగలిగితే విద్యార్థులు ఎగిరిగంతేసి చదువులను, జ్ఞానసంపదను ఎగరేసుకొని పోగలరు! ప్రభుత్వాలు విద్య కోసం గణనీయంగా బడ్జెట్‌ను పెంచాలి! ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సమకూర్చటమంటే ఉచితాలు అప్పనంగా ఇవ్వటం వారిని నిర్వీర్యులను చేసి ఓట్లు దండుకోవటానికే అన్న విమర్శలు ఎక్కువగా వినబడుతున్నాయి! ఉచితంగా వైద్యం, విద్య అందుబాటులో ఉంచగలుగుతే అంతకు మించి ప్రజానీకానికి సంక్షేమ కార్యక్రమాలు ఏముంటాయి? రాజకీయాలు చేయటం ఎప్పుడూ అక్కరకు రావు! ఓట్లు పడుతేనే ప్రభుత్వంలోకి ఏ పార్టీ అయినా రాగలదు! కానీ ప్రజలను అన్ని రకాలుగా యోగ్యులుగా చేయగలిగే విధంగా అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించే సమయం వచ్చింది! ఎన్నికల్లో గెలవటమే ప్రధానం కాదు! ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు తర్వాత ప్రజలందరూ ఒకటే అన్న సమున్నత విధానాన్ని అమలు చేయగలుగుతే దీర్ఘ కాలిక ప్రయోజనాలు ప్రజాస్వామ్య పరిధిలో న్యాయంగా నిజాయితీగా ప్రజలకు సమకూర్చిన వారవుతారు! అందుకనే 'విద్య'ను లక్ష్యంగా పెట్టుకొని గెలిచిన పార్టీ విద్యాధికులను అభ్యున్నతి కోసం తయారు చేయాలి! ●

జంక్ ఫుడ్‌తో ఇంకిపోతున్న ఆరోగ్యం

బుర్ర మధుసూదన్ రెడ్డి

పాశ్చాత్య దేశాలు వంటింటికి ఎప్పుడో విడాకులు ఇచ్చాయి. వారి ఇండ్లల్లో జంక్ ఫుడ్స్ దండయాత్ర చేశాయి. ఒక్క పూట కూడా జంక్ ఫుడ్ లేకుండా దినం గడవడం లేదు. జంక్ అంటేనే చెత్త అని కదా అర్థం. 1950 తర్వాత మైక్రోబయాలజిస్ట్ మైఖేల్ జాకబాసన్ రూపొందించిన పదం 'జంక్ ఫుడ్' నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్ద పెద్ద మాల్స్ నుంచి చిన్న చిన్న షాపుల వరకు అంతటా జంక్‌ఫుడ్ ప్యాకెట్ దండలే స్వాగతం పలుకుతున్నాయి. చిన్న, పెద్ద అందరూ తరుచుగా ఏదో ఒక సందర్భంలో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్ అండ్ ప్యాకెట్ ఫుడ్స్‌ను అమితానందంగా రుచి చూస్తున్నారు. పిల్లలు మాత్రం జంక్ ఫుడ్ విషవలయంలో చిక్కినట్లే కనిపిస్తున్నది. మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని శాసిస్తాయి. ఆధునిక వేగవంతమైన జీవనశైలిలో నేటి మానవుడు కొట్టుకుపోతున్నాడు. ఫ్యాషన్ల పేరుతో జంక్ ఫుడ్‌ను లొట్టలేసుకుంటూ ఆరగిస్తున్నాడు, ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నాడు. నేటి డిజిటల్ నరుడు జంక్, ఫాస్ట్‌ఫుడ్స్‌కు బానిస అయిపోయి తమ తమ ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నాడు. జంక్, ఫాస్ట్ ఫుడ్‌కు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, జంక్‌ఫుడ్ పట్ల జనాల్లో అవగాహన కల్పించవలసిన అగత్యం ఏర్పడిందని గమనించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా 21 జూలై రోజున 'జాతీయ జంక్ ఫుడ్ వ్యతిరేక దినం (నేషనల్ యాంటి జంక్ ఫుడ్ డే)' పాటించడం ఆనవాయితీగా మారింది. సాలీనా సగటున పొగాకు దురలవాట్లతో 8 మిలియన్ల ప్రజలు మరణిస్తే, జంక్ ఫుడ్ అతిగా తీసుకోవడం వల్ల 11 మిలియన్ల ప్రజలు మరణిస్తున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. 70 ఏండ్లు పైబడిన వృద్ధుల్లో సైతం 22 శాతం మరకలు జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల జరిగినట్లు స్పష్టం అవుతోంది. అధిక కొవ్వులు, చక్కెరలు, ఉప్పు, క్యాలరీలతో పాటు అతి తక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను జంక్ అండ్, ఫాస్ట్‌ఫుడ్ అని నిర్వచిస్తారు. తొలుత అమెరికాలో కాలుమోపిన జంక్ ఫుడ్ సంస్కృతి నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్దపెద్ద మాల్స్

లో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్, బేకరీ, ఫ్రోజెన్ ఫుడ్స్ వినియోగదారులకు నోరూరిస్తూ, వారిని బుట్టలో వేసుకుంటున్నాయి. డిజిటల్ నరులు ప్రయాణాలు అధికంగా చేయడం, భార్యాభర్తలు ఉద్యోగాలు చేయడం, ఆర్థికంగా బలపడడం, బజారు రుచులకు అలవాటు పడడం లాంటి అవలక్షణాలతో జంక్ ఫుడ్ విప్లవం కొనసాగుతున్నది. డీప్ ఫ్రై లేదా అతి వేపుడు చేసిన జంక్ అండ్ ఫాస్ట్ ఆహారం తీసుకోవడం వల్ల స్థూలకాయం లేదా అధిక బరువు, మధుమేహం/బిపీ లాంటి జీవనశైలి రుగ్మతలు, కొలెస్టరాల్ పెరగడం, గుండె జబ్బులు, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధ వ్యాధులు, అలసట, సోమరితనం, మానసిక అస్థిరత, ఏకాగ్రత లోపించడం, దంత సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు, కాలేయం/ మూత్రపిండ సమస్యలు, పోషకాహార లోపం, నిరాశ, దురలవాటుగా మారడం, మానసిక సమస్యలు లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. మహా నగరాలకు పరిమితమైన జంక్ ఫుడ్ నేడు వాడవాడల్లో తిష్ట వేసింది. 1996లో మెక్‌డొనాల్డ్ సెంటర్ల రాకతో నేడుఅలాంటి శాఖలు 400లకు పైగా ఉన్నాయి. నేడు భారత్‌లో దాదాపు 400 వరకు పేరుమోసిన సెంటర్లు నడుస్తున్నాయి. జంక్ ఫుడ్‌ను ప్రచారం చేస్తున్నాయి. నేడు బహుళ జాతి సంస్థలు నెలకొల్పిన మాల్స్ ద్వారా జంక్‌ఫుడ్ విరివిగా అమ్ముడుపోతున్నది, ఆరోగ్యాలను కాటు వేస్తున్నది. బర్గర్లు, ఫిజ్జాను, వైట్ బ్రెడ్, వేపుడు పదార్థాలు, కుక్కీస్, పొటాటో చిప్స్, ఐస్ క్రీమ్స్, శీతల పానీయాలు, చాకొలేట్స్, ప్రాసెస్డ్ మీట్, స్ట్రీట్ ఫాస్ట్ ఫుడ్స్ లాంటిరూపాల్లో జంక్ ఫుడ్స్‌గా మార్కెట్‌లను ముంచెతున్నాయి. భారత్‌లో ప్రతి ఏటా జంక్ ఫుడ్ వినియోగం 10 శాతం వరకు పెరగడం తో పాటు 93శాతం వరకు పిల్లలు వారానికి రెండు పూటలు జంక్

సిట్‌ను పునర్వ్యవస్థీకరించండి

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సూచించిన సుప్రీంకోర్టు

రామమందిర విరాళాల వివాదం

న్యూఢిల్లీ, జులై 20: శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందిన విరాళాలు, కానుకల నిర్వహణలో జరిగినట్లు ఆరోపించబడిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను పునర్వ్యవస్థీకరించడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ దర్యాప్తునకు ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వం వహించాలని, దానిని 'తార్కిక ముగింపు'కు తీసుకువెళ్లాలని కూడా పేర్కొంది.

భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని హెచ్చరించింది. ఒక నేరం జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు, దానిపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడటమే న్యాయస్థానాల బాధ్యత అని వ్యాఖ్యానించింది.

విచారణ సందర్భంగా, కేంద్రం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఒక సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు తెలియజేశారు. 'దర్యాప్తు కొనసాగుతోంది. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ దశలో ఎక్కువ వివరాలు వెల్లడించలేన్లే అని ఎస్‌జి మెహతా తెలిపారు.

దర్యాప్తు బృందం కూర్పు వివరాలను సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కోరగా, ఆరోపణల వాస్తవికతను నిర్ధారించడానికి మాత్రమే గతంలో సిట్‌ను ఏర్పాటు చేశారని, అదే స్వయంగా నేర దర్యాప్తు చేపట్టడం లేదని ఎస్జీ మెహతా స్పష్టం చేశారు. 'ఇప్పుడు ఎవరు దర్యాప్తు చేస్తున్నారు? దర్యాప్తు అధికారులు ఎవరు? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో సంబంధిత పోలీసు అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారని ఎస్జీ మెహతా తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సిట్‌లో ఇద్దరు ఐఏఎస్ అధికారులు, ఒక సీనియర్ ఐపి ఎస్ అధికారితో సహా సీనియర్ అధికారులు ఉన్నారని సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కొనసాగుతున్న దర్యాప్తును, ఈ విషయంపై ఇప్పటికే అవగాహన ఉన్న ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో పునర్వ్యవస్థీకరించిన సిట్‌కు అప్పగించాలని సూచించింది. 'కొనసాగుతున్న దర్యాప్తు కోసం ఒక సిట్‌ను ఏర్పాటు చేయండి. ఈ అధికారికి ఈ విషయంపై అవగాహన ఉంది కాబట్టి, ఆయనే దానికి నేతృత్వం వహించవచ్చు. ప్రభుత్వంతో మాట్లాడి, సిట్ ను పునర్వ్యవస్థీకరించండి. ఏవైనా అదనపు ఆదేశాలు అవసరమైతే, తాము వాటిని జారీ చేస్తామ్లు అని సుప్రీంకోర్టు పేర్కొంది. సిట్ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనపై స్టేటస్ రిపోర్ట్, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను పరిశీలించిన తర్వాత, వచ్చే సోమవారం ఈ విషయాన్ని మళ్లీ విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు సూచించింది. 'తాము కేవలం హెచ్చరిస్తున్నాము, ఈవిషయాన్ని రాజకీయం చేయవద్దు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగి, తార్కిక ముగింపునకు చేరాల్లి అని సీజేఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ, 'కోర్టులు రాజకీయాలకు వేదిక కాద్లు అని కూడా పేర్కొంది.

భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు

అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్, జులై 20: అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ 'అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్ముజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్య ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తోపాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, దాన్ని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదు' అని తెలిపారు. ఇదిలా ఉండగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్న ప్పటికీ దాన్ని ఎక్కువ రోజులు ఆధీనంలో ఉంచు కోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతుంది.

చుక్క చమురు కూడా హర్ముజ్ దాటదు: ఇరాన్

అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ హెచ్చరికలను ఖాతరు చేయకుండా హర్ముజ్ మీదుగా వెళ్తోన్న రెండు నౌకలను ఐఆర్‌జిసి టార్గెట్ చేసింది. వాటిలో పేలుడు సంభవించిందని, అవి కదల్లేని స్థితిలో ఉన్నాయని వెల్లడించింది. అమెరికా దురాక్రమణ కొనసాగుతున్నంతకాలం ఒక్క చుక్క చమురు కూడా సురక్షితంగా హర్ముజ్‌ను దాటదని ఐఆర్‌జిసి హెచ్చరించింది. ప్రతీకార చర్యలకు సిద్ధంగా ఉండాలని

అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది. మరోవైపు ఇరాన్‌పై సోమవారం తెల్లవారుజామున అగ్రరాజ్యం మరోసారి దాడులు చేపట్టింది. తమ సైనికుల మరణాలకు ప్రతీకారం తీర్చుకున్నామని, శక్తిమంతమైన దాడులు చేశామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం మొదలైన ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు అమెరికాకు ప్రాణనష్టం 17కు పెరిగింది. ఇదిలా ఉండగా పశ్చిమాసియా దద్దరిల్లుతుండటంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరింది.

కువైట్ ప్లాంట్స్‌లో చెలరేగిన మంటలు..

అమెరికా-ఇరాన్ ఘర్షణలతో గల్ఫ్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కువైట్‌లోని అల్ సుబియా పవర్ జనరేషన్, వాటర్ డీసాలినేషన్ ప్లాంట్‌పై టెహ్రాన్ దాడులు చేసింది. దాంతో భారీగా మంగలు చెలరేగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు వెరల్ అవుతున్నాయి.

హైకోర్టు జడ్జిలకు ఒకే విధానం

అత్యున్నత కమిటీని ఏర్పాటు చేయండి

3 నెలల్లోగా సిఫారసుల నివేదికివ్వండి

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జులై 20: దేశంలోని పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు సౌకర్యాల కల్పనలో ఏకరూప విధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటుచేసి, మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు లభించే భద్రత, ఇతర పదవీ విరమణానంతర సౌకర్యాలకు సంబంధించి పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. తమ ముందు లేవనెత్తిన ఆందోళనలను విన్న సిజెఐ, 'రాష్ట్రానికి రాష్ట్రానికి ఇటువంటి సౌకర్యాలు మారడానికి ఎటువంటి కారణం లేదుకాబట్టి, ఈ సౌకర్యాలను ఏకరూప ప్రాతిపదికన నిర్ధారించాలనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ దృక్కోణాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏకరూప మార్గదర్శకాలను, అలాగే ఆర్థిక సహాయం అందించే విధానం, యంత్రాంగాన్ని నిర్దేశించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తాము భారత కేంద్ర ప్రభుత్వాన్ని కోరాము' అని అన్నారు. దీని ప్రకారం, ఏర్పాటు చేసిన కమిటీ, అది ఏర్పడిన తేదీ నుండి మూడు నెలలలోపు తన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, అలాగే వాటిని కోర్టు ముందు కూడా ఉంచాలని ధర్మాసనం ఆదేశించింది.

'అపార్ఇ ఐడి నిర్బంధం కాదు, ఐచ్ఛికమే!

డేటా రక్షణ ఆందోళనలు పరిశీలించాలి

సిబిఎస్ఇకి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, జులై 20: 'ఆపార్ఇ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడిల జారీ కోసం ఇచ్చే సమ్మతి పత్రంలో స్పష్టమైన "ఆప్ట్ అవుట్" ఎంపికను తప్పనిసరి చేస్తూ ఒడిశా హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఎపిఎఎఆర్ (అపార్) పథకం స్వచ్ఛందంగా ఉండేలా, తల్లిదండ్రుల సమ్మతి పత్రాలలో సమ్మతిని నిరాకరించడానికి స్పష్టమైన అవకాశం ఉండేలా తగిన ఆదేశాలు జారీ చేస్తామని సూచించింది. 'ఒడిశా హైకోర్టు ఉత్తర్వును అంగీకరించినందున... ఈ తీర్పును పాన్‌ఇండియా ప్రాతిపదికన అమలు చేయాలి. ఈ సమస్యలను కూడా పరిశీలించాలని తాము సిబిఎస్ఇని ఆదేశిస్తున్నాము," అని విచారణ సందర్భంగా సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సిబిఎస్ఇ సర్క్యులర్లు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం, 2023తో సహా అమలులో ఉన్న చట్టానికి లోబడి ఉంటాయని, ఈ పథకాన్ని ప్రస్తుత చట్టపరమైన చట్రానికి అనుగుణంగా అమలు చేయాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'అపార్ఇ ఐడి పథకం రాజ్యాంగ బద్ధతను, బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం 'అపార్ఇ ఐడిలను తప్పనిసరి చేయాలన్న సిబిఎస్ఇ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపి ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

400 డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్

క్వీవ్,జులై 20: రష్యా రాజధాని మాస్కో లక్ష్యంగా ఉక్రెయిన్ ప్రతికార దాడులను తీవ్రతరం చేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున ఒకేసారి 400 కంటే ఎక్కువ డ్రోన్లతో మాస్కోపై విరుచుకుపడింది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు ఇతర నగరాలపై రష్యా జరిపిన తీవ్ర బాలిస్టిక్ క్షిపణి దాడులకు నిరసనగా ఉక్రెయిన్ ఈ చర్యకు దిగినట్లు అంతర్జాతీయ మీడియా స్పష్టం చేసింది. మాస్కో దిశగా వచ్చిన అత్యధిక డ్రోన్లను రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. మాస్కో పరిసరాల్లో దాదాపు 85 డ్రోన్లను అడ్డుకున్నట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. మాస్కో పరిసర ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో 10 మంది గాయపడినట్లు

సమాచారం. పడోల్స్క్‌లోని ఒక ఆయిల్ డిపోతో పాటు, మాస్కో సమీపంలోని యుజ్నె వ్రాతా ఇండస్ట్రియల్ పార్క్‌లో తీవ్ర అగ్నిప్రమాదాలు సంభవించాయి. పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయి. ఉక్రెయిన్ వైమానిక రక్షణ లోపాలను అనుకూలంగా మార్చుకునేందుకు రష్యా ఇటీవల బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాన్ని గణనీయంగా పెంచింది. ఆదివారం రష్యా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌లో ఆరుగురు ప్రాణా లు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడినట్లు తెలిసింది.

హిందూ వివాహం ఒక ఒప్పందం కాదు

భార్యపై ఆసక్తి పోయిందంటే కుదరదు: కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

విడాకుల అభ్యర్థనను కొట్టివేసిన కోర్టు

బెంగళూరు, జులై 20: కేవలం తన జీవిత భాగస్వామిపై ఆసక్తి పోయిందన్న కారణంతో ఒక వ్యక్తి వివాహబంధం నుండి వైదొలగడం లేదా విడాకులు కోరడం కుదరదని కర్ణాటక హైకోర్టు విస్పష్ట తీర్పునిచ్చింది. న్యాయమూర్తులు డి.కె.సింగ్, టి.ఎం.నాడాఫ్‌లతో కూడిన ధర్మాసనం, హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం అని, అది కేవలం ఒక ఒప్పందం కాదని నొక్కి చెప్పింది. కాబట్టి, వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం కొనసాగుతుందని పేర్కొంది. 'హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం, అది ఒప్పందం కాదు. వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం ఉంటుంది. అవతలి వ్యక్తిపై ఆసక్తి లేదన్న కారణంతో ఎవరూ ఆ వివాహ బంధం నుండి వైదొలగలేర్లు అని ధర్మాసనం తీర్పునిచ్చింది. హిందూ వివాహ చట్టం, 1955లోని సెక్షన్ 13(1ఎ) కింద విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసే క్రమంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు దాదాపు వయోజనురాలైన కుమార్తెకు తండ్రి అయిన భర్త, కేవలం వివాహంపై ఆసక్తి కోల్పోయానని చెబుతూ కోర్టును ఆశ్రయించడం ద్వారా తన తప్పును తానే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని హైకోర్టు గమనించింది. హిందూ చట్టం ప్రకారం వివాహం ఒక సంస్కారం, ఒప్పందం కాదని, ఆసక్తి లేదనే కారణంతో ఒక పక్షం దాని నుండి వైదొలగలేదని కోర్టు పునరుద్ఘాటించింది. అందువల్ల, ఫ్యామిలీ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించక పోవడంతో, అప్పీల్‌ను కొట్టివేసింది.

సుప్రీం జడ్జిల పెంపు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ,జులై 20: సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్ సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) యాక్ట్, 1956ను మార్చనున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచు కోవచ్చు. దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురా వాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాం గంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది.

చర్చలు అర్థవంతంగా, వాస్తవాల ఆధారంగా సాగాలి

పార్లమెంటు సమావేశాల సందర్భంగా విపక్షాలకు మోడీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ,జులై 20: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, రాజకీయ పార్టీలకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు దేశానికి అత్యంత ఫలవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పార్లమెంట్‌లో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా సాగాలని అన్నారు. వాదనలు, వాస్తవాలు ఉన్నచోట అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదు. వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం ఉండదని ప్రధాని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని మోడీ రుతుపవనాలు ఎంత ముఖ్యమో, వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా అంతే ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రుతుపవనాలు చురుకుగా ఉండి రైతులకు మేలు చేయడంతో పాటు, పార్లమెంట్ సమావేశాలు కూడా సజావుగా జరిగి దేశ ప్రయోజనాలకు దోహదపడాలని కోరుకున్నారు. దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను కూడా ప్రధాని వివరించారు. ఇటీవల రాజస్థాన్లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేసినట్లు గుర్తు చేశారు. అలాగే దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం, గ్రీన్ హైడ్రోజన్తో నడిచే రైలు ప్రారంభం వంటి ప్రాజెక్టులు భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనాలని పేర్కొన్నారు. ప్రపంచంలో కొద్ది దేశాలకు మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ రైలు సాంకేతికత ఇప్పుడు భారత్లో అందుబాటులోకి రావడం గర్వకారణమని చెప్పారు ప్రధాని మోడీ. గత నెలలో భారత్ సాధించిన పలు విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఇటీవల ఒక భారతీయ యువత నేతృత్వంలోని స్టార్టప్ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిని చేరుకోవడం దేశానికి గర్వకారణమని అన్నారు. గత ఏడాది భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండగా, ఇప్పుడు భారత యువత అంతరిక్ష సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఇది యువత సామర్థ్యం, ఆశయాలు అపరిమితమని

ప్రపంచానికి చాటి చెబుతోందని అన్నారు మోడీ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు 25 రోజుల వ్యవధిలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ కాలంలో మొత్తం 19 సమావేశాలు జరగనున్నాయి. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చలు, సంప్రదింపులు, కీలక నిర్ణయాలు ఈ సమావేశాల్లో తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు ప్రధాని నరేంద్ర మోడీ.

హమాస్ కొత్త అధినేతగా ఖలీల్ అల్‌హయ్యా

గాజాసిటీ,జులై 20: తీవ్రవాద సంస్థ హమాస్‌కు కొత్త నాయకుడు ఎన్నిక య్యారు. ఖలీల్ అల్-హ య్యాను తమ అధిపతిగా ఎన్నుకున్నట్లు హమాస్ ప్రకటించింది. గతంలో గాజాలోని హమాస్ రాజకీయ విభాగానికి నాయకత్వం వహించిన అల్‌హయ్యా ఇప్పుడు సంస్థకు అత్యున్నత స్థాయి నాయకుడిగా బాధ్యతలు చేపట్టను న్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన హమాస్ దాడి అనంతరం ప్రారంభమైన యుద్ధంలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించిన చర్చల్లో ఖలీల్ అల్‌హయ్యా కీలక పాత్ర పోషించారు. హమాస్ ప్రధాన సంధానకర్తగా కూడా ఆయన వ్యవహ రించారు. హమాస్ మాజీ నాయకులు యహ్యా సిన్వార్, ఇస్మాయిల్ హనియే మరణాల తర్వాత గత రెండేళ్లుగా ఐదుగురు సభ్యులతో కూడిన నాయకత్వ మండలి సంస్థను నడిపించింది. తాజాగా జరిగిన అంతర్గత ఎన్నికల్లో అల్‌హయ్యా కొత్త నాయకుడిగా ఎంపికయ్యారు. గాజా స్ట్రిప్‌లో జన్మించిన ఖలీల్ అల్‌హయ్యా తన జీవితంలో ఎక్కువ భాగాన్ని అక్కడే గడిపారు. 2023 అక్టోబర్ దాడులకు కొద్దికాలం ముందు గాజా నుంచి ఖతార్‌కు వెళ్లిన ఆయన అప్పటి నుంచి అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ

న్యూఢిల్లీ,జులై 20: వర్షాకాలం ప్రారంభమైతే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు వేగంగా పెరుగుతుంటాయి. ప్రతి ఏడాది వేలాది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితులు కూడా ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో భారతదేశానికి ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలో తొలిసారిగా డెంగ్యూ నివారణ కోసం క్యూడెంగా వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఈ వ్యాక్సిన్ ప్రత్యేకత ఏమిటంటే, టీకా తీసుకునే ముందు డెంగ్యూ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు. గతంలో డెంగ్యూ వచ్చినవారు అయినా, ఎప్పుడూ డెంగ్యూ రాకపోయినా ఈ టీకాను తీసుకోవచ్చు. దీంతో డెంగ్యూ నివారణలో ఇది ఒక కీలక ముందడుగుగా వైద్య నిపుణులు భావిస్తున్నారు. క్యూడెంగా వ్యాక్సిన్‌ను రెండు డోసులుగా ఇస్తారు. మొదటి డోస్ తీసుకున్న మూడు నెలల తర్వాత రెండో డోస్ వేయించుకోవాలి.

ఈ టీకాను చర్మం కింద (సబ్‌క్యూటేనియస్) ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకేడా అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 4 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారికి వినియోగించేందుకు అనుమతించారు. ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు అధికంగా నమోదయ్యే దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచ డెంగ్యూ భారంలో దాదాపు మూడింట ఒక వంతు కేసులు భారతదేశంలోనే నమోదవుతున్నట్లు అంచనా. గత రెండు దశాబ్దాల్లో దేశంలో డెంగ్యూ కేసులు దాదాపు 11 రెట్లు పెరిగినట్లు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గత ఏడాదిలోనే లక్షకు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే అసలు సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా. డెంగ్యూ వైరస్‌కు నాలుగు రకాల (సెరోటైప్స్) ఉన్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు రకాల వైరస్‌ల నుంచి రక్షణ కల్పించేలా క్యూడెంగాను రూపొందించారు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ వ్యాక్సిన్‌పై 28 వేల మందికి పైగా క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. రెండో డోస్ తర్వాత 12 నెలలకు డెంగ్యూ నివారణలో 80.2 శాతం ప్రభావవంతంగా, డెంగ్యూ కారణంగా ఆసుపత్రిలో చేరే ప్రమాదాన్ని 90.4 శాతం వరకు తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేసిందని అధ్యయనాలు సూచించాయి. దీర్ఘకాలిక పరిశోధనల్లో కూడా 4.5 సంవత్సరాల తర్వాత ఆసుపత్రి చికిత్స అవసరాన్ని 84.1 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు.

ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సిఫార్సు చేసింది. నాణ్యత, భద్రత, ప్రభావం వంటి అంతర్జాతీయ ప్రమాణాలను ఇది అందుకుందని డబ్ల్యుహెచ్ఒ ప్రీక్వాలిఫికేషన్ కూడా పొందింది. ప్రస్తుతం భారత్‌తో పాటు 43 దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 3.2 కోట్లకు పైగా డోసులు పంపిణీ అయ్యాయి. బ్రెజిల్, అర్జెంటీనా, కొలంబియా, ఇండోనేషియా వంటి దేశాల్లో ప్రజారోగ్య టీకా కార్యక్రమాల్లో దీనిని వినియోగిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

ఎబోలా వైరస్: కాంగాలో 930కి పెరిగిన మృతుల సంఖ్య

బునియా, జులై 20: మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెంద

రేపు మంత్రి పొంగులేటి 'ప్రజలతో ముఖాముఖి'

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: రెవెన్యూ, గృహనిర్మాణం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గాంధీభవన్‌లో ఇందిరాభవన్‌లో ఆయన విన్నపాలు స్వీకరించనున్నారు. ప్రజపాలనలో భాగంగా పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో తొలుత పెద్దఎత్తున ప్రజలు తమ సమస్యల సాధనకు ఈ వేదికను ఉపయోగపడుతోందని భావించి పెద్దఎత్తున వినతలు ఇచ్చేవారు, కానీ ఇటీవల రేషన్ కార్డుల కోసం ఇతర సమస్యల కోసం దరఖాస్తుదారులు విన్నపాలు చేసుకోవడం తగ్గింది.



నిమ్స్‌లో బాలింతలను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

బాన్సువాడ ఘటనపై విచారణ జరిపి బాధితులను ఆదుకోవాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ (జూబ్లిహిల్స్), జులై 20, ప్రభాతవార్త: బాన్సువాడ మాతాశిశు ఆసుపత్రిలో సిజేరియన్ అనంతరం ఇన్‌ఫెక్షన్ బారినపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలింతలను మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ 10 మంది బాలింతలు ఇన్‌ఫెక్షన్ బారినపడినా ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర నిరక్ష్యమని విమర్శించారు. ఆపరేషన్ థియేటర్ నిర్వహణలో లోపాలు, వైద్యుల నిరక్ష్యం, కాలం చెల్లిన మందుల వినియోగం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిసిన తర్వాత కూడా అదే థియేటర్‌లో మరిన్ని సిజేరియన్లు చేయడం వైద్య శాఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయి వైద్యం అందించి, తగిన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఖమ్మంలో అత్యాచారానికి గురైన మైనర్ బాలిక భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం పరమేశ్వరుడిని ప్రార్థించా: పిసిసి చీఫ్ మహేశ్

హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త: నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ ఉమామహేశ్వర ఆలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ప్రత్యేక అభిషేక పూజల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పరమేశ్వరుడిని ప్రార్థించానని తెలిపారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య సుమారు గంటపాటు అభిషేకం ప్రత్యేక పూజలు మహేష్‌కుమార్ నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

హైదరాబాద్‌లో సిఐఎస్ఎఫ్ వారి 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్-2026

23 నుంచి 30 వరకు 5 క్రీడాంశాల్లో పోటీలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై20: అఖిల భారత పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఏఐపీఎస్‌సీబీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) నిర్వహించే 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్- 2026 గచ్చిబౌలిలోని జీఎమ్‌సీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈనెల 23 నుంచి 30 వరకు జరగనుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో 36 రాష్ట్ర పోలీస్, కేంద్ర సాయుధ భద్రతా దళాల (సీఏపీఎఫ్) సంస్థలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని జూడో, వుషు, టేక్వాండో, కరాటే, పెంచాక్ సిలాట్ క్రీడాంశాలలో పోటీపడనున్నారు. ఆయా జాతీయ సమాఖ్యలకు చెందిన దాదాపు 150 మంది సాంకేతిక అధికారులు ఈ పోటీలను పర్యవేక్షించనున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో (ఎన్ఐఎస్ఏ) నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో (కర్టెన్ రైజర్‌కమ్‌ప్రెస్ కాన్ఫరెన్స్) ఈ ఛాంపియన్‌షిప్ వివరాలను వెల్లడించారు. మీడియాను ఉద్దేశించి ఎన్ఐఎస్ఏ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ హర్‌ప్రీత్ కౌర్ సోహి మాట్లాడుతూ.. ఈ ఛాంపియన్‌షిప్ పోలీస్, సీఏపీఎఫ్ సిబ్బందిలో క్రీడా సంస్కృతిని పెంపొందించడంతో పాటు అథ్లెట్లు తమ ప్రతిభను, క్రీడా నైపుణ్యాన్ని చాటుకోవడానికి ఒక జాతీయ వేదికను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఒలింపియన్ పారుపల్లి కశ్యప్, ప్రముఖ రోయింగ్ కోచ్ ఇస్మాయిల్ బైగ్ మాట్లాడుతూ.. యూనిఫాం ధరించే దళాలలో క్రమశిక్షణ, సహనశీలత, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉద్ఘాటించారు.

ఈ ఛాంపియన్‌షిప్ అథ్లెట్లను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026 రానున్న వేళ ఈ ఛాంపియన్‌షిప్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇందులో పోటీపడుతున్న అయిదు క్రీడల్లో జూడో, వుషు, టేక్వాండో, కరాటేలు ఆసియా క్రీడల్లో కూడా ఉన్నాయి. పోలీస్, సీఏపీఎఫ్‌లకు చెందిన అథ్లెట్లకు అంతర్జాతీయ స్థాయికి ఉపయోగపడే విలువైన పోటీ అనుభవాన్ని ఇది అందించనుంది. తెలంగాణ రాష్ట్ర జంతువైన మచ్చల జింక (చితాల్) ఆధారంగా రూపొందించిన ఈ ఛాంపియన్‌షిప్ మస్కట్ వీరాను ఆవిష్కరించారు. ఇది సజీవత, ప్రభావ శీలత, సహనశీలత, చురుకుదనం అనే గుణాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది మార్షల్ ఆర్ట్స్, భద్రతా దళాల స్ఫూర్తిని తెలియజేస్తోంది.ఈ కార్యక్రమానికి తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఇతర భాగస్వామ్య సంస్థలు రవాణా, నిర్వహణ సహకారాన్ని అంది స్తు న్నాయి. నిర్ణీత నిబంధనలకు అనుగుణంగా నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) యాంటీడోపింగ్ పరీక్షలను నిర్వహిస్తుంది. పాల్గొనే క్రీడాకారులు, అధికారుల కోసం సమగ్రమైన వైద్య, వసతి ఏర్పాట్లు చేశారు.

పిటిషన్స్ కమిటీ ప్రజల గొంతుక

శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

పిటిషన్స్ కమిటీ ప్రథమ సమావేశం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 20: సోమవారం తెలంగాణ శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో శాసన మండలి పిటిషన్స్‌కమిటీ ప్రథమ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన సభ వ్యవహారాల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, రెహ్మత్ బేగ్, దామోదర్ రెడ్డి, కోదండరాం, మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పిటిషన్స్ కమిటీ అనేది ప్రజల గొంతుక లాంటిది. ఈ కమిటీ సభ్యులందరు చురుకుగా పని చేస్తే ప్రజల్లో మంచి పేరు, గుర్తింపు వస్తుంది. లేజిస్లేచర్ కమిటీలో సభ్యులుగా ఉండటం బాధ్యతగా భావించాలని సూచించారు. పిటిషన్స్ అనేవి భవిష్యత్ లో పెండింగ్ లో లేకుండా చూసుకోవాలని పక్క ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తెలిపారు.

శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ,శాసన మండలి సభలను అధికార, ప్రతిపక్ష అనే తారతమ్యం లేకుండా నడుపు తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కమిటీలను నియమించుకున్నామని, పిటిషన్ అనేది లేజిస్లేచర్ నమూనా పద్ధతిలో ఇవ్వాలి, అలా ఇస్తేనే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. లేజిస్లేచర్ కమిటిలలో స్థానం దక్కడం అదృష్టంగా భావించాలి. కమిటీలల్లో చురుకుగా పని చేస్తే అనుభవం పెరుగుతోందన్నారు. గతంలో నేను కూడా అసెంబ్లీ లైబ్రరీ కమిటీలో పనిచేసి నేడు ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేశారు.డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ శాసన మండలి పిటిషన్స్ కమిటీ చైర్మన్‌గా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నా కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. సభలను, కమిటీలను సజావుగా నడిపేందుకు పూర్తి సహకారం అందిస్తున్న శాసన సభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్, శాసన సభ వ్యవహారాల మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

యాదాద్రి థర్మల్ విద్యుత్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై

పవర్ ఎంప్లాయీస్ జెఏసి నిరసన

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్ అండ్ యాష్ హ్యాండ్లింగ్ యూనిట్ల కార్యకలాపాలను ప్రైవేటీ కరించేందుకు టెండర్లు ఆహ్వానించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేసీ) ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు సోమవారం డివిజనల్ ఇంజనీర్ (డీఈ) కార్యాలయ ప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. టీజీపీఈజేఏసీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు, విద్యుత్ కార్మికులు, సిబ్బంది తమ వ్యతిరేకతను నమోదు చేయడానికి నల్ల బ్యాడ్జీలు ధరించి డీఈ కార్యాలయానికి చేరుకున్నారు. భోజన విరామ సమయంలో, ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో పెద్ద సంఖ్యలో గుమికూడి, విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా తీవ్ర నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లాభదాయకమైన ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రయత్నాన్ని టీజీపీఈజేఏసీ నాయకులు ఖండించారు. బొగ్గు, బూడిద నిర్వహణ వంటి కీలక విభాగాలను ప్రైవేటీకరించడం కార్మికుల హక్కులకు, అలాగే ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థల దీర్ఘకాలిక మనుగడకు తీవ్ర ముప్పు కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా తమ నిరసనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. టీజీపీఈజేఏసీ సెక్రటరీ జనరల్ రాంజీ నాయక్, కన్వీనర్ అర్కుల్లా ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు) సుందర్ సతీష్ మరియు శంకర్‌లతో పాటు, పెద్ద సంఖ్యలో డివిజన్ స్థాయి విద్యుత్ ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు మరియు సిబ్బంది ఈ ప్రదర్శనలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్స్‌లో 2 స్వర్ణ, 2 రజత పతకాలతో నారాయణ సరికొత్త చరిత్ర

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: ప్రపంచస్థాయి సైన్స్ పోటీలలో నారాయణ విద్యార్థులు మరోసారి భారతదేశ పేరును అంతర్జాతీయ వేదికపై మారుమోగించారు. ఇటీవల ముగిసిన 37వ అంతర్జాతీయ బయాలజీ ఒలింపియాడ్ (ఐబివో) 2026, 58వ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపి యాడ్ (ఐసీహెచ్‌వో) 2026 పోటీలలో నారాయణ విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో 2 స్వర్ణాలు, 2 రజత పతకాలు కైవశం చేసుకున్నారు. శాస్త్రీయ రంగానికి అద్భుతమైన ప్రతిభను అందించడంలో తమకున్న అగ్రగామి స్థానాన్ని నారాయణ విద్యాసంస్థలు ఈ విజయంతో మరొకసారి చాటిచెప్పాయి. విల్నియస్, లిథువేనియాలో జరిగిన 37వ అంతర్జాతీయ బయాలజీ ఒలింపియాడ్ (ఐబివో 2026)లో భవ్యా గున్వాల్ గోల్డ్ మెడల్ (స్వర్ణం), అన్మోల్ కుమార్ సిల్వర్ మెడల్ (రజతం), నిషిత్ కలాని సిల్వర్ మెడల్ (రజతం) సాధించారు. మొత్తం 78 దేశాల నుండి 307 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో, భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన నలుగురిలో ముగ్గురు నారాయణ విద్యార్థులే కావడం విశేషం. ఆరు గంటల ప్రాక్టికల్, థియరీ పరీక్షలను ఎదుర్కొని టీమ్ ఇండియా మొత్తం 1 గోల్డ్, 3 సిల్వర్ పతకాలను సాధించింది. అలాగే తాష్కెంట్, ఉజ్బెకిస్తాన్లో జరిగిన 58వ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ (ఐసీహెచ్‌వో 2026) సందీప్ కూచి గోల్డ్ మెడల్ (స్వర్ణం) సాధించాడు. కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో టీమ్ ఇండియా 4 స్వర్ణ పతకాలతో రికార్డు సృష్టించగా, అందులో సందీప్ కూచి కీలక పాత్ర పోషించాడు. గత ఏడాది (2025) దుబాయ్ లో జరిగిన 57వ ఐసీహెచ్‌వోలో కూడా స్వర్ణం సాధించిన సందీప్, వరుసగా రెండోసారి అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్ సాధించి తన అసాధారణ నైపుణ్యాన్ని నిరూపించుకున్నాడు. అంతర్జాతీయ విజయాలతో పాటు, మన దేశంలో అత్యంత కఠినమైన పోటీ పరీక్షలలోనూ నారాయణ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులు సాధించారు. సందీప్ కూచి జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 లో ఆల్ ఇండియా 5వ ర్యాంక్, భవ్యా గున్వాల్, నీట్-యుజి 2026 లో ఆల్ ఇండియా 71వ ర్యాంక్, (భవ్యా గతంలో రొమేనియాలో జరిగిన ఐజేఎస్‌వో2024లో గోల్డ్, ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఐబివో 2025లో సిల్వర్ మెడల్స్ సాధించింది. అంతేకాక ఒక స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీవో) ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తూ మార్గదర్శిగా నిలుస్తోంది. ఇటీవలే కొలంబియాలో జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపీహెచ్‌వో) 2026లో శ్రేష్ సురయ గోల్డ్ మెడల్ సాధించగా, ఆ విజయంతో కలిపి కేవలం ఒకే వారంలో నారాయణ విద్యార్థులు మొత్తం 3 స్వర్ణాలు, 2 రజత పతకాలను భారత్‌కు అందించడం గమనార్హం. ఈ చారిత్రాత్మక విజయంపై నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి పొంగూరు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు నారాయణ వేదికగా మారిందన్నారు. అంతర్జాతీయ బయాలజీ మరియు కెమిస్ట్రీ ఒలింపియాడ్స్ 2026లో మన విద్యార్థులు 2 స్వర్ణాలు, 2 రజతాలు సాధించడం ఎంతో గర్వ కారణమన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, అధ్యాపకుల అంకితభావం నారాయణ అకడమిక్ వ్యవస్థకి ఇది ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుం దన్నారు. శ్రేష్ సుదయ విజయం తర్వాత సందీప్, భవ్య, అన్మోల్, నిషిత్ సాధించిన ఈ విజయాలు నారాయణ అద్భుతమైన విజయ ప్రస్థానాన్ని నిర్విఘ్నంగా కొనసాగించినట్లు తెలిపారు. 17 సంవత్సరాలకు పైగా అనుభవం, నైపుణ్యం, అంకితభావం సూత్రాలతో విద్యార్థుల కలలను నిజం చేస్తూ, అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించడంలో నారాయణ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

పిజిఐ ర్యాంకింగ్‌లో టాప్‌లో ఉండేలా ప్రయత్నించాలి

దేశంలో 18వ స్థానానికి అధికారుల సమష్టి కృషి దోహదం

సదస్సులో విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) ర్యాంకింగ్‌లో దేశంలోనే టాప్‌లో ఉండేలా అధికారులు కృషి చేయాలని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. డీఈవోలతో పాటు ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖ అధికారుల(డీఈవో)తో పాటు జిల్లా ప్రణాళిక సమన్వయకర్తలు, ఒక్కో జిల్లా నుంచి 7 మంది అధికారుల బృందానికి పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)పై విద్యాశాఖ రెండు రోజుల రాష్ట్ర స్థాయి రెసిడెన్షియల్ ఓరియంటేషన్ కార్యక్రమాన్నిహైదరాబాద్‌లోని ఎం.సి.ఆర్. హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ప్రారంభించారు. పాఠశాల విద్యా వ్యవస్థ పనితీరును అంచనా వేయడంలో పిజిఐ ఫ్రేమ్‌వర్క్, దాని సూచికలు, డేటా అవసరాలు, దాని ప్రాముఖ్యతపై జిల్లా విద్యా బృందాల అవగాహనను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా బృందాలకు వారి పనితీరును వివరంగా విశ్లేషించడానికి, సూచికల వారీగా లోపాలను గుర్తించడానికి, జిల్లాల మధ్య వ్యత్యాసాలకు గల కారణాలను అర్థం చేసుకోవడానికి, మెరుగుదల కోసం నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడానికి ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లా నుండి ఏడుగురు సభ్యుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటోంది. ఈ బృందంలో జిల్లా విద్యాధికారి, జిల్లా నాణ్యతా సమన్వయకర్త, జిల్లా ప్రణాళికా సమన్వయకర్త, సహాయ గణాంక సమన్వయకర్త, ఒక మండల విద్యాధికారి, ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు, ఒక క్లస్టర్ వనరుల వ్యక్తి ఉంటారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించి, జిల్లా బృందాలతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో టాప్ ర్యాంకు సాధించేందుకు నిరంతర కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర, జిల్లా విద్యా అధికారులను అభినందిస్తూ, పీజీఐ 2024-25లో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ, పీజీఐ 2025-26 నాటికి 18వ స్థానానికి మెరుగుపడి గణనీయమైన పురోగతి సాధించిందని కార్యదర్శి పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, క్లస్టర్, పాఠశాల స్థాయిలలో పనిచేస్తున్న అధికారులు, కార్యకర్తల సమిష్టి కృషి ఫలితమే ఈ మెరుగుదల అని ఆమె తెలిపారు. జిల్లా పీజీఐ ఫ్రేమ్‌వర్క్ కింద తెలంగాణలో మొదటి రెండు స్థానాలు సాధించిన జనగాం, మంచిర్యాల జిల్లాలను ఆమె అభినందించారు. పీజీఐని కేవలం ర్యాంకింగ్ ప్రక్రియగా మాత్రమే చూడకూడదని నొక్కి చెప్పారు. ఇది ఒక ముఖ్యమైన నిర్ధారణ చట్రమని, ఇది విద్యా వ్యవస్థ తన బలాబలాలను అర్థం చేసుకోవడానికి, నిరంతర లోపాలను గుర్తించ డానికి, అభ్యసన ఫలితాలు, ప్రాప్యత, మౌలిక సదుపాయాలు, సమానత్వం, పరిపాలన, నిర్వహణ వంటి అంశాలలో జోక్యాలకు ప్రాధా న్యత ఇవ్వడానికి సహాయ పడుతుందన్నారు. ప్రతి స్థాయిలో స్పష్టమైన జవాబుదారీతనంతో, డేటా సేకరణ, ధృవీకరణ, నిర్ధారణ కోసం పటిష్టమైన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కార్యదర్శి జిల్లా అధికారులను ఆదేశించారు. కేవలం మొత్తం స్కోరు లేదా ర్యాంకుపై దృష్టి పెట్టకుండా, సూచికల వారీగా పని తీరుపై అంతర్గత సమీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని జిల్లాలలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.

మాతా శిశు ఆరోగ్య సంరక్షణలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

రాష్ట్ర ఆరోగ్య శాఖ పనితీరుకు కేంద్రం ప్రశంసలు

ప్రోత్సాహకంగా రూ.200 కోట్ల అదనపు నిధుల మంజూరు

హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త: మాతా శిశు ఆరోగ్య సేవల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రం సాధించిన ఫలితాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.200 కోట్ల అదనపు నిధులను మంజూరు చేసిందని సోమవారం వెల్లడించారు. ఈ నిధులను రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాతాశిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన హాస్పిటళ్లలో నవజాత శిశు సంరక్షణ విభాగాల విస్తరణ, లేబర్ రూములు, ఆపరేషన్ థియేటర్లను జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఆధునికీకరణ, మిడ్‌వైఫరీలెడ్ కేర్ యూనిట్లు, కంగారూ మదర్ కేర్ (కెఎంసి) వార్డులు, లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో తల్లి, గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని అత్యాధునిక పరికరాలతో పర్యవేక్షించే వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా తీర్చిదిద్ది, నేషనల్ క్వాలిటీ అష్యూరన్స్ (ఎన్‌క్యూఏస్) సర్టిఫికేషన్ పొందేలా మౌలిక వసతుల కల్పన, వైద్య సేవలను మరింత బలోపేతం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ ప్రోత్సాహక నిధులు రాష్ట్రంలో మాతృ మరణాలు, నవజాత శిశు మరణాలను మరింత తగ్గించడంతో పాటు ప్రతి ప్రభుత్వ హాస్పిటల్‌లో నాణ్యమైన మాతాశిశు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఎంతగానో ఉపయోగపడుతాయని సంగీత సత్యనారాయణ పేర్కొన్నారు.

2023 బ్యాచ్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందే

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం

హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త: ఇంక్రిమెంట్ కేసులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 2023 బ్యాచ్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందేనని తీర్పునిచ్చిందని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్(టిజిఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం తెలిపారు. జూనియర్ లెక్చరర్ల ప్రయోజనాల కోసం తమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం, సెక్రటరీ సిద్ధారెడ్డి తెలిపారు. జూనియర్ లెక్చరర్ల ఇంక్రిమెంట్ కేసులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 2023 బ్యాచ్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందేనని, ఈ ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేయాలని తీర్పునివ్వడంతో న్యాయం గెలిచిందన్నారు. ఈ కేసులో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లను కోర్టు కొట్టు వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం తరఫున ఏజీ రాహుల్ రెడ్డి, 2025వ బ్యాచ్ అధ్యాపకుల తరఫున అడ్వకేట్ రచనరెడ్డి వాదించినట్లు చెప్పారు. తమ సంఘం తరఫున నాయక్ వాడి రమేష్ పూర్తి ఆధారాలతో వాదించి 2023 బ్యాచ్ అధ్యాపకులకు ఇంక్రిమెంట్ అందేలా కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నట్టు తెలిపారు. ఈ అంశంపై ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేనందున సంబంధిత శాఖ తప్పనిసరిగా కోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు. టీజీఎల్ఏ నిబద్ధత, చిత్తశుద్ధి, పోరాట పటిమతో ప్రతి దశలో అధ్యాపకుల ప్రయోజనాల కోసం ముందుకు సాగుతుందని కనకచంద్రం స్పష్టం చేశారు.

ప్రణాళికబద్ధ కార్యాచరణతో ప్రతికూల వాతావరణానికి చెక్: పిసిసి చీఫ్

హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త: ప్రణాళికబద్ధమైన ప్రత్యామ్నయ కార్యాచరణతో ఎల్‌నీనోతో తలెత్తే ప్రతికూల వాతావర్ణ పరిస్థితులను ఎదుర్కొందామని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు.సోమవారం ప్రతికూల వాతావరణ పరిస్థితులపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిజామాబాద్‌లోని నూతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు.

సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ

బహదూర్‌గూడ భూములపై హైకోర్టు కీలక ఆదేశాలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 20: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ భూముల వివాదంలో రాష్ట్ర హైకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వివాదాస్పద భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు చేపట్ట వద్దని స్పష్టం చేస్తూ నలుగురు రైతులకు తాత్కాలిక ఉపశమనం కల్పించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బహదూర్‌గూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 3,4లో ఉన్న 28 ఎకరాల భూమి తమదేనని, గత 30 ఏళ్లుగా ఆ భూముల్లో సాగు చేస్తున్నామని పేర్కొంటూ నలుగురు రైతులు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు మూడు దశాబ్దాలుగా ఆ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. భూములపై పిటిషనర్లకు హక్కులు ఉన్నాయని, ఇటీవల ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యల వల్ల సాగు హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని వాదించారు. వివాదాస్పద భూముల్లో అధికారులు జోక్యం చేసుకోవడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరై వాదనలు వినిపించారు. పిటిషనర్లు తమ హక్కులను నిరూపించేందుకు చూపుతున్న పట్టాదారు పాస్ పుస్తకాలపై సంబంధిత అధికారుల సంతకాలు లేవని కోర్టుకు వివరించారు. కేవలం కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారనే కారణంతో భూమిపై యాజమాన్య హక్కులు కల్పించలేమని పేర్కొన్నారు. వివాదాస్పద భూమి ప్రభుత్వ భూమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన భూములు సర్వే నంబర్లు 28, 62 పరిధిలోని ప్రభుత్వ భూములేనని, పిటిషనర్లు పేర్కొంటున్న సర్వే నంబర్లు 3, 4లోని భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని కోర్టుకు తెలియజేశారు. ఇరు పక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు, రైతుల తరఫు వాదనలను ప్రాథమికంగా పరిగణనలోకి తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పిటిషనర్లుగా ఉన్న నలుగురు రైతులు సాగు చేస్తున్నట్లు పేర్కొన్న భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. దీంతో రైతులకు తాత్కాలిక ఉపశమనం లభించింది.

సిఎస్ సంజయ్‌జాజుతో గంగపుత్ర అభివృద్ధి సంస్థ ప్రతినిధుల భేటీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై20: రాష్ట్రంలో గంగ పుత్ర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ ప్రతినిధులు సోమవారం సాయంత్రం సచివాలయంలో కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత చేప పిల్లల పంపిణీ లోపభూయిష్టంగా అమలవుతుందని, 30 నుంచి 40శాతమే చెరువులలో స్టాకింగ్ అవుతుందని పేర్కొన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు డైరెక్ట్ క్యాష్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫార్మ్ చేయడం ద్వారా సంఘం వారే స్వయంగా నాణ్యమైన చేపపిల్లలు కొనుగోలు చేసి వారి చెరువులలో వందశాతం చేయడం ద్వారా చేపల ఉత్పత్తి ఘనంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ వినతి పత్రం అందజేశారు. మెదక్ జిల్లాలో ప్రభుత్వ మత్స్య క్షేత్రంలో అక్కడ పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ అలసత్వం వల్ల 35 గుంటల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమై ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా కోర్టు ఆర్డర్ వచ్చిందని తెలిపారు. మత్స్య శాఖ కమిషనర్, సెక్రటరీలకు విన్నవించిన నేపథ్యంలో జెడి స్థాయి అధికారులు విచారణ జరిపినప్పటికీ తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. సిఎస్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు పి. మహిపాల్, ప్రధాన కార్యదర్శి ఎర్వ వెంకటేశం, సలహాదారులు గాలి సత్యనారాయణ, దోలి విజయకుమార్ తదితరులు ఉన్నారు.

26న రాష్ట్రానికి కేంద్రమంత్రి అమిత్‌షా రాక

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై20: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈనెల 26న తెలంగాణకు రానున్నారు. కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు కానున్నారని సమాచారం. ఆయన పర్యటనకు సంబంధించి పూర్తి స్తాయి షెడ్యూల్ రావాల్సి ఉంది.

వర్షపాతం లోటుపై రైతుకు సమాచారం అందాలి

ఖరీఫ్‌కు సాగర్, పాలేరు నుంచి సాగునీరు లేదు

డి.సిఎం భట్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జూలై 15 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రైతులు ప్రస్తుతం పత్తి అధికంగా సాగు చేశారని, వర్షాలు వస్తే వరి పంట వేద్దామని చూస్తున్నారని, భూగర్భ జలాలు గలవారు వరి పంట సాగుకు ముందుకు వెళ్తున్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. భూగర్భ జలాలు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే రెండు నెలల్లో మరింత తగ్గిపోతాయని, రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే జిల్లాల్లో సమీక్షా సమావేశాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి పారుదల, ప్రణాళిక, వ్యవసాయ, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం లోటు ఎంత, దాని ప్రభావం ఏమిటనే అంశాలపై ప్రతి రైతుకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం వద్ద ఉన్న వాస్తవ సమాచారం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత ఏడాది, ఈ ఏడాది నీటి వనరుల లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై వివరాలతో ప్రణాళిక శాఖ సమగ్ర నివేదిక సిద్ధం చేసి మీడియాకు, క్షేత్రస్థాయి అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించిన మేరకు రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించుకోవచ్చో అన్ని సాంకేతిక అవకాశాలను పరిశీలించి తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వర్షపాతం పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి మాత్రమే రైతులు పంటల ఎంపిక చేసుకునేలా క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని, పాలేరు ఆయకట్టుకు కూడా సాగునీరు అందుబాటులో ఉండదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. వాస్తవ పరిస్థితులను దాచకుండా అధికారులు నేరుగా రైతులతో మాట్లాడాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా త్రాగునీటి వనరులు సరిపోని పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాబోయే ఒక సంవత్సరం త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత ఆధారంగా మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని, వరి వంటి నీటి అధిక అవసరమున్న పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. పెసర, మినుములు, కందులు, అలసంద, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను మాత్రమే రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశము ఉన్నందున బోర్ల ఆధారంగా వరి సాగు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. డిప్యూటీ సిఎం, మంత్రి, జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ తెలంగాణ జలసిరి, ఎల్ నినో సూపర్ స్థితిలో తీసుకునే చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు టెండర్లు పిలిచాం

రూ.496.86 కోట్లతో విమానాశ్రయం అభివృద్ధికి ఎఎఐ ఆమోదం

ఆదిలాబాద్ విమానాశ్రయం జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్

కొత్త విమానాశ్రయాలపై వేం నరేందర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం క్లారిటీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 20: తెలంగాణలోని ఆదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెం విమానాశ్రయాలపై కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు టెండర్లు పిలిచామని తెలిపారు. తెలంగాణలో ఉడాన్ పథకం కింద ఇప్పటివరకు 58 రూట్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయ అభివృద్ధి పనుల్లో వేగం పెరిగిందని వెల్లడించారు. రూ.496.86 కోట్ల అంచనా వ్యయంతో (జీఎస్టీతో కలిపి) మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు ఏఎఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. అందులో భాగంగానే రన్‌వే, అప్రాన్, టాక్సీవే వంటి పెవ్‌మెంట్ పనులతో పాటు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి టెండర్లను ఏఏఐ ఇప్పటికే పబ్లిష్ చేసింది. అయితే.. భూసేకరణ, అవసరమైన కేంద్ర అనుమతులు పూర్తికావడంపైనే విమానాల రాకపోకలు ప్రారంభమయ్యే గడువు ఆధారపడి ఉంటుందని కేంద్ర తెలిపింది. ఆదిలాబాద్ విమానాశ్రయం జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు ఏఏఐ టెక్నోఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనం పూర్తి చేసింది. దీనికి సంబంధించి ఎంత భూమి అవసరమనే వివరాలను కూడా తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికే సమాచారం అందించామని కేంద్రం పేర్కొంది. పెద్దపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కోసం ప్రతిపాదించిన స్థలానికి సంబంధించిన ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయన నివేదికను ఏఏఐ 2026 ఫిబ్రవరిలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. 2025 జనవరిలో భద్రాద్రి కొత్తగూడెంలోని రామావరం, చుంచుపల్లి, సుజాతనగర్ గ్రామాల్లో చేసిన సర్వేలో కొండలు, రైల్వే లైన్ అడ్డంకిగా ఉండటంతో ఆ స్థలం సరిపోదని తేలిందని పేర్కొంది.

ఉక్రెయిన్‌లో క్షిపణి దాడి.. నలుగురు భారతీయ నావికులు మృతి

న్యూఢిల్లీ, జులై 20: ఉక్రెయిన్‌లోని ఒడెస్సా పోర్టు సమీపంలో వాణిజ్య సరకు నౌక ఎంవీ గోల్డెన్ లియోపై జరిగిన క్షిపణి దాడిలో నలుగురు భారతీయులు మృతి చెందగా, మరో భారతీయుడు తీవ్రంగా గాయపడినట్లు విదేశాంగ శాఖ సోమవారం వెల్లడించింది. ఈనెల 19 సాయంత్రం పోర్టు నుంచి బయలుదేరుతున్న సమయంలో ఈ దాడి జరిగినట్లు తెలిపింది. మొక్కజొన్న సరుకుతో ప్రయాణిస్తున్న ఈ నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఐదుగురు భారతీయులు ఉన్నారు. దాడి అనంతరం నలుగురు భారతీయులు అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో భారతీయుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన భారత ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. వాణిజ్య నౌకలు, అమాయక నౌకా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని జరిపే దాడులు అత్యంత దారుణమని పేర్కొంది. సముద్ర మార్గాల్లో నౌకాయాన స్వేచ్ఛను, పౌరుల భద్రతను అన్ని దేశాలు కాపాడాల్సిన అవసరం ఉందని భారత్ పునరుద్ఘాటించింది. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందిస్తున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.

దేవాదాయ శాఖలో పూర్తిస్థాయి డిజిటలీకరణే లక్ష్యం

దేవాదాయ మంత్రి కొండా సురేఖ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై20: దేవాదాయ శాఖ పరిధిలోని పరిపాలనను పూర్తిస్థాయిలో డిజిటలీకరణే ప్రభుత్వ లక్ష్యమని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ధార్మిక సంస్థలు, దేవాలయాల చట్టం 2025 డ్రాఫ్ట్‌పై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో డిజిటల్ సంస్కరణలకు దిశానిర్దేశం చేశారు. టిఏఐఎంఎస్ వ్యవస్థకు మరిన్ని మెరుగులు దిద్దాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. భక్తులకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. టిఏఐఎంఎస్‌పై అధికారుల ప్రజెంటేషన్‌కు మంత్రి కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు డ్రాఫ్ట్ రూల్స్‌పై సుదీర్ఘంగా సమీక్షి ంచారు. ట్రస్ట్ బోర్డు పనితీరు పారదర్శకంగా ఉండేలా నియమావళి రూపొందించాలని సూచించారు. దేవస్థానాల పరిపాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులకు వివరించారు. యాదగిరిగుట్ట వేములవాడ దేవాలయాల్లోని సిబ్బంది పరస్పర బదిలీలపై మంత్రి సురేఖకు ఈ సందర్భంగా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతోపాటు వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ వివరించారు.

ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.90.85 లక్షల ఆర్థిక సాయం :మంత్రి పొన్నం

త్వరలోనే ఆర్టీసీ విలీన ప్రక్రియ ప్రారంభం

మృతుడి కుమారుడికి ఉద్యోగం, ఇల్లు మంజూరు

హైదరాబాద్ (చిక్కడపల్లి) జులై 20, ప్రభాతవార్త: ఆర్టీసీ విలీన ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. సోమవారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్ లో విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ దివంగత కోలా శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు అండగా నిలిచారు. ఉద్యోగుల చేయూత కార్యక్రమం ద్వారా సేకరించిన తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయం చెక్కును శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఈడీలు, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని.. తెలంగాణ ఉద్యమ కాలంలో "నై చలేగా బస్ కా పయ్యా అంటూ ఆర్టీసీ కార్మికులు పోరాడిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ వస్తున్నామని, రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సైతం తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నాలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ముందుకు సాగుతామని, రాబోయే ఎన్నికల తర్వాత ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా అధికారికంగా ప్రారంభిస్తామని మంత్రి కీలక ప్రకటన చేశారు.

ఈ సందర్భంగా శంకర్ గౌడ్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించి, ధైర్యం చెప్పారు. శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగంతో పాటు, ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆర్టీసీ పేద ప్రజల లైఫ్ లైన్ అని, ప్రజా రవాణాలో తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే ముందంజలో నిలిపేందుకు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు కార్మికులు మరింత బాధ్యతగా సహకరించాలని కోరారు. రాష్ట్రంలో రూ.6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న నిరుపేదలకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని, ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.



మృతుడు ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి చేయూత పథకం కింద చెక్కును అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి తదితరులు

సారీ నాన్నా.. సాధించలేకపోయా

కదిలించిన బిటెక్ గోల్డ్‌మెడలిస్టు ఆత్మహత్య లేఖ

కాన్పూరు, జులై 20: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన 23 ఏళ్ల ఆనంద్ కుమార్ బీటెక్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాడు. 2024లో కాన్పూర్‌లోని ప్రణ్‌వీర్ సింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (పీఎస్ఐటీ)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో

గోల్డ్ మెడల్ సాధించాడు. రాష్ట్రవ్యాప్తంగా మూడో ర్యాంకు దక్కించుకున్నాడు. కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ చేతుల మీదుగా స్వర్ణ పతకం అందుకున్నాడు. ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్న ఆనంద్ భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తైన తర్వాత పవర్ గ్రిడ్‌లో ఏడాది పాటు అప్రెంటిస్‌గా పనిచేశాడు. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యాడు. రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకులు, విద్యాశాఖ నిర్వహించిన నియామక పరీక్షలు సహా దాదాపు 50 పరీక్షలు రాసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ప్రతీసారి నిరాశే ఎదురైంది. వరుస అపజయాలతో గత కొన్ని నెలలుగా తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నాడని అతడి తండ్రి రాజ్‌కుమార్ వెల్లడించారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు పెద్ద కుమారుడి వివాహం ఖరారు చేసేందుకు బీహార్‌లోని స్వగ్రామానికి వెళ్లారు. ఆనంద్ మాత్రం కాన్పూర్‌లోని గోవిందనగర్‌లో ఉన్న ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు.

చాలాసేపు తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో ఇంటి పనిమనిషి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు తలుపులు తెరిచి చూడగా గదిలో ఉరివేసుకున్న స్థితిలో ఆనంద్ కనిపించాడు. అక్కడే అతడు రాసిన ఐదు లైన్ల లేఖను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో తన తండ్రికి క్షమాపణ చెబుతూ హృదయవిదారకంగా రాశాడు. సారీ నాన్నా ప్రభుత్వ ఉద్యోగం కోసం దాదాపు 50 సార్లు ప్రయత్నించాను. అయినా విజయం సాధించలేకపోయాను. నన్ను క్షమించండి అని ఇంగ్లిష్‌లో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువతలో పెరుగుతున్న ఉద్యోగ ఒత్తిడి, పోటీ పరీక్షల మానసిక భారం మరోసారి చర్చకు దారితీసింది.

అట్టుడికిన ఢిల్లీ

>> పెద్ద ఎత్తున సీజేపీ కార్యకర్తలు వచ్చి వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. ఈక్రమంలో వారిపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. పోలీసులపైకి ఆందోళనకారులు వాటర్ బాటిళ్లు, చెప్పులు విసిరారు. తోపులాటలో పోలీసులు, ఆందోళనకారులకు గాయాలయ్యాయి. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. నిరాహార దీక్షను విరమించిన కొద్ది సేపటికే అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ తెలిపింది. అయితే అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారని వార్తలను దిల్లీ పోలీసులు ఖండించారు. ఆ వార్తలు పూర్తిగా అవాస్తమని తెలిపారు. మరోవైపు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దారుణంగా దాడి చేస్తున్నారని, విద్యార్థులకు ఎంపీలు మద్దతు ఇవ్వాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ కోరారు. చర్చలకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా దిల్లీలో ఆందోళనల మధ్యే సీజేపీ ప్రతినిధులు కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిశారు. జేపీ నడ్డా ఆహ్వానం మేరకే ఆయన్ను కలిశామన్న సిజెపి ప్రతిని సౌరవ్ దాస్ తమ డిమాండ్లకు సంబంధించి వినతిపత్రం అందించామని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే నిర్బంధం నుంచి విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశామన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆత్మహత్యలు చేసుకున్న నీట్ అభ్యర్థులకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరినట్లు సిజెపి ప్రతినిధులు తెలిపారు. ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించేందుకు కొంత సమయం ఇవ్వాలని నడ్డా విజ్ఞప్తి చేశారని వివరించారు. మరోవైపు ఆందోళనలు విరమించి దిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు సహకరించాలని సిజెపి ప్రతినిధులను నడ్డా కోరారు.

జెపి నడ్డాతో సిజెపి ప్రతినిధుల చర్చలు..

కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డాను కలిసి సిజెపి ప్రతినిధులు సౌరవ్‌దాస్ మరొకరు కలిసి చర్చలుజరిపారు. ప్రభుత్వం అంతర్గతంగా చర్చించి చర్యలు తీసుకునేందుకు శాయశక్తులా కృషిచేస్తామని మంత్రి సిజెపి ప్రతినిధులకు హామీ ఇచ్చారు. తమ

టీమిండియాకు మిడిల్ ఓవర్ బౌలర్ కొరత

భారత్ మ్యాచ్ విన్నర్ బెంచ్‌కే పరిమితం

ఇంగ్లండ్ వన్డే ఓటమిపై పోస్ట్‌మార్టమ్

న్యూఢిల్లీ: ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియా ఓటమి అనేక ప్రశ్నలను లేవనెత్తింది. వీటిలో అత్యంత చర్చనీయాంశంగా ఉన్నది కుల్దీప్ యాదవ్. తన స్పిన్‌తో ప్రపంచవ్యాప్తంగా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టినప్పటికీ, అతనికి మూడు మ్యాచ్‌లలో ఒక్క అవకాశం కూడా లభించలేదు. లార్డ్స్‌లో జరిగిన మూడవ వన్డేకు గాయం కారణంగా జస్ప్రీత్ బుమ్రా దూరమయ్యాడు. అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కుల్దీప్‌ను తుది జట్టులోకి తీసుకోవాల్సిన అవసరం లేదని భావించారు. వన్డే ఓటమిపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు పోస్ట్‌మార్టంలో కుల్దీప్ వ్యవహారం విమర్శపాలైంది. ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్ నుంచే, వికెట్లు తీస్తూ పరుగులు నియంత్రించడంలో నైపుణ్యం ఉన్న మిడిల్ ఓవర్ బౌలర్ కొరత టీమ్ ఇండియాకు ఏర్పడింది. ఈ పాత్రకు కుల్దీప్ యాదవ్ కంటే మెరుగైన ఆటగాడు లేడు. మొదటి వన్డేలో, 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు 258 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత, రెండవ వన్డేలో, 53 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ, వారు 234 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో, జస్ప్రీత్ బుమ్రాను తుది జట్టులోకి తీసుకోకపోవడం వల్ల 192 పరుగుల వద్ద మొదటి వికెట్ పడింది. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం అతని కెరీర్‌పై ప్రశ్నలను లేవనెత్తింది. జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోయినప్పటికీ లార్డ్స్ వన్డే తుది జట్టులో కుల్దీప్‌కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. కుల్దీప్ యాదవ్ యొక్క అద్భుతమైన రికార్డును చూస్తే అతను మూడు ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో అతను తనను తాను నిరూపించుకున్నాడు. 121 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో, అతను 118 ఇన్నింగ్స్‌లలో 194 వికెట్లు పడగొట్టాడు. అతని చివరి వన్డే ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగింది, ఆ మ్యాచ్‌లో అతను 10 ఓవర్ల స్పెల్‌లో 42 పరుగులిచ్చి వికెట్లేమీ తీయలేదు. అయితే, జట్టు యాజమాన్యం కేవలం ఒక మ్యాచ్ ఆధారంగా కుల్దీప్‌ను అంచనా వేసి పొరపాటు చేసిందనే చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు కెప్టెన్‌గా రుతురాజ్

న్యూఢిల్లీ: దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు నాయకత్వం రుతురాజ్ గైక్వాడ్ వహించనున్నాడు. ఈ దులీప్ ట్రోఫీ ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ 2026-2027 సీజన్‌కు కూడా జోనల్ ఫార్మాట్‌లోనే కొనసాగుతుంది. ముంబై చీఫ్ సెలెక్టర్ రాజేష్ పవార్ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశం అనంతరం సోమవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో, మహారాష్ట్ర బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా, ముంబైకి చెందిన షామ్స్ ములానీని వెస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా నియమించారు. గత సీజన్‌లో జట్టుకు నాయకత్వం వహించిన పేసర్ శార్దూల్ ఠాకూర్ నుండి, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న మరియు ఇటీవల శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్‌లతో జరిగిన ట్రై సిరీస్‌లో ఇండియా ఎ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన గైక్వాడ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఆగష్టు 23, 26 తేదీలలో జరిగే టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్ 2లో వెస్ట్ జోన్, నార్త్ జోన్‌తో తలపడుతుంది. దులీప్ ట్రోఫీలో ఫైనల్‌తో సహా మొత్తం ఐదు మ్యాచ్‌లు ఉంటాయి, ఇవి సెప్టెంబర్ 6 నుండి 10 వరకు దివీని గ్రౌండ్ 1లో ఆడబడతాయి. కెప్టెన్ గైక్వాడ్ నేతృత్వంలో పృథ్వీ షా, ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, శివాలిక్ శర్మ, జయమీత్ పటేల్, సిద్ధార్థ్ దేశాయ్ వంటి బ్యాటింగ్ ఎంపికలు జట్టుకు యువత, అనుభవం కలయికను అందిస్తున్నాయి. ఈ జట్టులో సౌరాష్ట్ర నుండి ఏకైక ఆటగాడైన హార్విక్ దేశాయ్, గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్ ఇద్దరూ వికెట్ కీపర్లుగా ఉంటూ, జట్టుకు వికెట్ల వెనుక బలమైన ప్రత్యామ్నాయాలను అందించనున్నారు.

స్పెయిన్‌దే ఫుట్‌బాల్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలలేదు. దాంతో ఎక్స్‌ట్రా టైమ్ ఆడించాల్సి వచ్చింది. ఈ సమయాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. 106వ నిమిషంలో స్పెయిన్ ప్లేయర్ ఫెర్రాన్ టొర్రెస్ అద్వితీయమైన గోల్‌తో చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండో ప్రపంచకప్‌ను ముద్దాడింది. 2010లో తొలి ప్రపంచకప్‌ను గెలుచుకున్న స్పెయిన్ 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ విశ్వవిజేతగా నిలిచింది. ఈ ఫైనల్లోస్పెయిన్ టికి టాకా వ్యూహం ముందు అర్జెంటీనా తేలిపోయింది. ఫైనల్లో పూర్తిగా స్పెయిన్ ఆధిపత్యం కనబర్చింది. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్న స్పెయిన్ అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై పదే పదే దాడి చేసింది. కానీ ఆ జట్టు గోల్ కీపర్ మార్టినెజ్ అడ్డుగోడలా నిలిచాడు. లేకుంటే అర్జెంటీనా ఘోర పరాజయాన్ని మూటగట్టుకునేది. స్పెయిన్ ఆటలో 68 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించింది. అంతేకాకుండా అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై 11 సార్లు దాడి చేసింది. తమ టికీ టాకా వ్యూహంతో చిన్న చిన్న పాస్‌లు ఇచ్చుకుంటూ ఆటను వేగంగా నడిచేలా చూసుకుంది. ప్రత్యర్థి ప్రణాళికలను ముందే పసిగడుతూ చెలరేగింది. అర్జెంటీనా ప్లేయర్ ఫెర్నాండో 90+3 నిమిషంలో రెడ్ కార్డుతో బయటకు వెళ్లి పోవడం ఆ జట్టు కొంపముంచింది. దాంతో అర్జెంటీనా 10 మంది ప్లేయర్లతోనే మిగతా ఆటను కొనసాగించాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. ఫైనల్లో గోల్ కొట్టి స్పెయిన్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఫెర్రాన్ టొర్రెస్‌కు సుపీరియర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

ఫిఫా వరల్డ్ కప్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు

న్యూఢిల్లీ: ఫిఫా వరల్డ్‌కప్ చాంపియన్‌గా స్పెయిన్ అవతరించిన విషయం తెలిసిందే. అసాధారణ రీతిలో సాగిన ఫైనల్లో 1-0 గోల్స్ తేడాతో అర్జెంటీనాను స్పెయిన్ ఓడించింది. అయితే వరల్డ్‌కప్‌లో అందజేసే అవార్డుల్లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు దక్కాయి. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శించిన స్పెయిన్ ప్లేయర్ రోడ్రికి గోల్డెన్ బాల్, అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీకి సిల్వర్ బాల్, ఫ్రాన్స్ ప్లేయర్ కైలియన్ ఎంబాప్పేకు బ్రాంజ్ బాల్ అవార్డులు దదక్కాయి. ఇక ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ బూట్ అవార్డు ఎంబాప్పేకు దక్కింది. అతనికి బ్రాంజ్ బాల్‌తో పాటు గోల్డెన్ బూట్ అవార్డు దక్కడం విశేషం. టోర్నీలో అతను 10 గోల్స్, 4 అసిస్ట్‌లతో ఆ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సిల్వర్ బూట్ అవార్డు మెస్సీని వరించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్‌కు బ్రాంజ్ బూట్ అవార్డు దక్కింది. ఇక టోర్నీలో ప్రత్యర్థులకు గోల్ పోస్టులో అడ్డుగోడలా నిలిచిన గోల్‌కీపర్ ఉనాయ్ సిమన్‌కు గోల్డెన్ గ్లోవ్ అవార్డు దక్కింది. ఫిఫా యంగ్ ప్లేయర్ అవార్డు స్పెయిన్ ప్లేయర్ పావు కుబారిస్‌కు దక్కింది. ఇక ఫెయిర్ ప్లే ట్రోఫీ నెదర్లాండ్స్ జట్టును వరించింది.

స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్‌కు టైటిల్

న్యూఢిల్లీ: స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్ ఏటీపీ టైటిల్‌ను గెలుచుకున్నాడు. స్విస్ ఓపెన్‌లో, గ్రీస్‌కు చెందిన స్టెఫానోస్ సిట్సిపాస్ బెల్జియంకు చెందిన రాఫెల్ కొలిగ్నాన్‌పై మూడు సెట్ల విజయంతో దాదాపు ఏడాదిన్నర తర్వాత ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మాజీ ప్రపంచ ర్యాంకర్ 3, క్లే కోర్ట్ టోర్నమెంట్‌లో 6-4, 6-7 (3), 6-3 తేడాతో గెలిచి, తన కెరీర్‌లో 13వ ట్రోఫీని, ఫిబ్రవరి 2025లో దుబాయ్ తర్వాత మొదటి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. 27 ఏళ్ల అతను 2021లో తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ అయిన మూడో స్థానం నుండి ప్రపంచ ర్యాంకింగ్‌లో 85వ స్థానానికి పడిపోయాడు మరియు ఆ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో, 2023లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. సిట్సిపాస్ 2019లో లండన్‌లో జరిగిన ఏటీపీ మాస్టర్స్‌ను, అలాగే 2021, 2022 మరియు 2024లో మూడుసార్లు మాంటె కార్లో మాస్టర్స్‌ను కూడా గెలుచుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 42వ స్థానంలో ఉన్న 24 ఏళ్ల కొలిగ్నాన్, సెమీఫైనల్స్‌లో అర్జెంటీనాకు చెందిన జువాన్ మాన్యుయెల్ సెరుండోలోను ఒక మ్యాచ్ పాయింట్‌తో ఓడించి, తన మొదటి ఏటీపీ ఫైనల్ ఆడుతున్నాడు.

రాణించడమే నా బాధ్యత

రిటైర్మెంట్ పై రోహిత్

న్యూఢిల్లీ: లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన చివరివన్డే మ్యాచ్‌లో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ 138 పరుగులతో అద్భుతమైన సెంచరీ సాధించినప్పటికీ భారత్‌కు విజయాన్ని అందించలేకపోయాడు. 110 బంతుల్లో అయిదు భారీ సిక్సర్లు, ఏడు మెరుపు బౌండరీలతో హిట్ మ్యాన్ 138 పరుగులు బాదాడు. లాఫ్టెడ్, హుక్, లాంగ్, స్వీప్, కవర్ డ్రైవ్ ఇలా దాదాపు అన్ని షాట్లతో రెచ్చిపోయాడు. ఈ సెంచరీతో రోహిత్ శర్మ ఎన్నో అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకుని ఐకాన్‌గా నిలిచాడు. వన్డే సిరీస్ ఓటమి అనంతరం రోహిత్ శర్మ మాట్లాడాడు. తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించాడు. తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను తేలిగ్గా తీసుకున్నాడు. వాటిని కొట్టిపారేశాడు. దేశం కోసం రాణించడమే ఓ క్రికెటర్ గా తన బాధ్యత అని స్పష్టం చేశాడు. తన భవిష్యత్ గురించి వస్తోన్న వ్యాఖ్యలు విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వట్లేని, క్రీడా జీవితంలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రచారాలు సహజమేనని, ఆట ద్వారా మాత్రమే వీటికి సమాధానం ఇస్తానని పేర్కొన్నాడు. కెరీర్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచే తన చుట్టూ ఇటువంటి వాతావరణం ప్రచారంలో ఉందని, అవి లేకపోతే ఎంటర్టైన్మెంటే ఉండబోదని నవ్వుతూ చెప్పాడు. విరాట్ కోహ్లీ గురించి మాట్లాడుతూ కెరీర్ ప్రారంభం నుండే కలిసి ప్రయాణిస్తోన్నామని, క్రీజ్ లో ఉన్నప్పుడు ఒకరి వ్యూహాలను ఒకరు పంచుకుంటూ బ్యాటింగ్ చేస్తుంటామని, అది విజయానికి దోహదపడుతుందని వివరించాడు. లార్డ్స్ వన్డే ఓటమిపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులోని యువ బౌలర్లకు వన్డే ఫార్మాట్‌లో తగినంత అనుభవం లేదని, వారు రాణించడానికి మరికొంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ఈ ఓటమి నుంచి నేర్చుకున్న పాఠాలు భవిష్యత్తు సిరీస్‌లలో ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్ పర్యటనలో లభించే కఠిన సవాళ్లు ఓ క్రికెటర్‌గా తనకు ఎంతో సంతృప్తిని ఇస్తాయని వ్యాఖ్యానించాడు.

విదేశీ డిపాజిట్ల సమీకరణలో బ్యాంకుల రికార్డు

ఎఫ్‌సిఎన్‌ఆర్ డిపాజిట్లపై 20.712 బిలియన్ డాలర్ల సేకరణ

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన విదేశీ నిధుల డిపాజిట్ పథకానికి విశేష స్పందన లభించింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన చర్యల ద్వారా జూన్ 8 నుంచి జూలై 17, 2026 వరకు బ్యాంకులు 17.4 బిలియన్ డాలర్ల తాజా ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లను సమీకరించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇదే కాలంలో ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్ ద్వారా 1.97 బిలియన్ డాలర్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ద్వారా మరో 1.342 బిలియన్ డాలర్లు సమీకరించాయి. ఈ మూడు మార్గాల్లో మొత్తం 20.712 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు దేశంలోకి వచ్చాయి. విదేశీ మూలధన పెట్టుబడులు, డిపాజిట్లను ప్రోత్సహించడం, దేశ చెల్లింపుల సమతుల్యతను బలోపేతం చేయడం, విదేశీ మారక నిల్వలను పెంచడం ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశం. ఈ ప్యాకేజీలో భాగంగా, కొత్తగా సమీకరించే ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీ నిధుల కోసం ఆర్‌బీఐ రాయితీ స్వాప్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ సదుపాయం ద్వారా బ్యాంకులు విదేశీ కరెన్సీలో వచ్చిన నిధులను అనుకూల మారకపు నిబంధనలతో రూపాయిలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లకు స్వాప్ విండో సెప్టెంబర్ 30, 2026 వరకు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీలకు డిసెంబర్ 31, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి బ్యాంకులు, విదేశీ పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ అందిస్తున్న రాయితీ స్వాప్ సౌకర్యం వల్ల బ్యాంకులకు కూడా ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం లభిస్తోంది. విదేశీ మారక నిధుల ప్రవాహాన్ని పెంచడం, దేశ బాహ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ చర్యలు ఇప్పటికే ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి.

వాణిజ్యం

మూలధన లాభాల పన్ను రేట్లలో మార్పు ప్రతిపాదన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ,జులై20: దేశంలో మూలధన లాభాలపై విధించే పన్ను రేట్లలో మార్పులు చేయాలన్న ప్రతిపాదనఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్ను విధానంలో మార్పులపై వస్తున్న ఊహాగానాలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానంతో తెరపడింది. పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ మూలధన లాభాల పన్ను రేట్లతో పాటు ఇతర పన్ను విధానాలను ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్ ప్రక్రియలో భాగంగా, దేశంలోని స్థూల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమీక్షిస్తామని పేర్కొంది. ప్రస్తుతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రేట్లలో మార్పు చేసే ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఇక ఈక్విటీ లావాదేవీలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈక్విటీ లావాదేవీలపై లిగిదిబి పన్ను ద్వారా రూ.1, 29,158 కోట్లు వసూలుకాగా అంతకు ముందు ఈ ఆదాయం రూ.72,249 కోట్లు మాత్రమే ఉంది. తాజా గణాంకాల ప్రకారం 79 శాతం వృద్ధి నమోదైంది. స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు పెరగడం, పన్ను వసూళ్లు అధికం కావడం ఇందుకు ప్రధాన కారణాలని ప్రభుత్వం పేర్కొంది.

ఈ యేడు ఆర్థికవృద్ధి 6.5 -6.8శాతమే

-డెలాయిట్ ఇండియా

న్యూఢిల్లీ,జులై 20: భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం నుంచి 6.8 శాతం మధ్య వృద్ధిని నమోదు చేసే అవకాశముందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. పండుగల సీజన్‌లో వినియోగ డిమాండ్ పెరగడం, రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సడలింపులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు క్రమంగా స్థిరపడటం వంటి అంశాల కారణంగా ఆర్థిక వృద్ధి రెండో అర్ధభాగంలో మరింత బలపడుతుందని సంస్థ తన తాజా ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం, ఈఏడాది ప్రారంభంలో భారత్ ఆర్థిక వ్యవస్థ గోల్డీలాక్స్ దశలోకి ప్రవేశించింది. ద్రవ్యోల్బణం, వృద్ధి, వడ్డీ రేట్లు వంటి కీలక స్థూల ఆర్థిక సూచీలు సమతుల్య స్థితిలో కనిపించాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేశాయి. కీలక సముద్ర రవాణా మార్గాల్లో అంతరాయాలు ఏర్పడటం, వస్తు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు రావడం, పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని నివేదిక వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావంతో భారత వాణిజ్య లోటుపెరిగిందని, విదేశీ పెట్టుబడులవిత్డ్రా కొనసాగిందని, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తక్కువ కాలంలోనే గణనీయంగా పడిపోయిందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గత నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వాతావరణం మరింత అనిశ్చితంగా మారిందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న భౌగోళిక పరిణామాలు, ఆర్‌బీఐ తీసుకున్న విధానపరమైన చర్యలు కొన్ని ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అనిశ్చితులు, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుదల, ఆహార ధరల పెరుగుదల వంటి అంశాలు వృద్ధికి ప్రధాన ప్రతికూల ప్రమాదాలుగా మిగిలి ఉన్నాయని తెలిపారు ఎఫ్‌టీఏల ద్వారా లభించే మార్కెట్ అవకాశాలను శాశ్వత పోటీ సామర్థ్యంగా మార్చుకోవడం అత్యంత అవసరమని రుమ్కి మజుందార్ సూచించారు. వాణిజ్య విధానాలకు తోడు పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, దేశీయ సరఫరా వ్యవస్థల బలోపేతం, నిబంధనల సరళీకరణ, ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధిపై పెట్టుబడులు పెంచాలని ఆమె అభిప్రాయపడ్డారు. ముడి చమురు, ఎరువులు, కీలక ఖనిజాలు, వంటనూనెల ధరలు పెరగడం, రూపాయి బలహీనపడటం వల్ల దేశీయ ధరలపై ఒత్తిడి పెరుగుతోందని నివేదిక తెలిపింది.

ఈక్విటీ సూచీలను దెబ్బతీసిన ప్రైవేటు బ్యాంకులు

నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి,జులై 20: దేశీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ప్రైవేట్ బ్యాంకుల ఫలితాల తర్వాత ఈ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం వంటి అంశాలు కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. రంగాల వారీగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా, ఎనర్జీ షేర్లు లాభపడగా, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 442.93 పాయింట్లు పడిపోయి 77,708.52 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.80 పాయింట్లు కోల్పోయి 24,238.50 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.47లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ0.21 పెరిగింది. బీఎస్ఈలో2,226 షేర్లు లాభపడగా, 2,039 షేర్లు నష్టపోయాయి. 255 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.780 నుంచి 6.782 శాతానికి స్వల్పంగా పెరిగింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే గత ముగింపు 96.3050 నుంచి 96.4500 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.66 పెరిగి రూ.1,41,793కు చేరాయి. సెప్టెంబర్ 2026 బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 14 సెంట్లు తగ్గి 87.96 డాలర్ల వద్ద ట్రేడైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.08 క్షీణించింది. యాక్సిస్ బ్యాంక్ 5.37 పడిపోయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.96 నష్టపోయింది. యెస్ బ్యాంక్ 2.80 తగ్గింది. ఐడీబీఐ బ్యాంక్ 2.10 పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం 1.16 లాభపడింది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 0.19 పెరిగింది. కంపెనీ స్వతంత్ర నికర లాభం ఏడాది ప్రాతిపదికన 26.64 పెరిగి రూ.253.70 కోట్లకు చేరింది.

సైబర్ భద్రతా లోపాలపై సిడిఎస్ఎల్‌కు

సెబీ కోటి జరిమానా

న్యూఢిల్లీ,జులై 20: దేశీయ మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2022లో జరిగిన మాల్వేర్ సైబర్ దాడికి సంబంధించి సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) రూ.1 కోటి జరిమానా విధించింది. సైబర్ భద్రతా నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ దాడి జరిగిందని, ఇది ముందుగానే ఊహించదగిన ఘటనేనని సెబీ తన ఉత్తర్వులో స్పష్టం చేసింది. విడుదల చేసిన 88 పేజీల ఉత్తర్వులో, సెబీ చట్టం కింద రూ.90 లక్షలు, డిపాజిటరీస్ చట్టం కింద రూ.10 లక్షలు జరిమానా విధించింది.

సీడీఎస్ఎల్ మాజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజేష్ నడ్కర్ణి, మాజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అమిత్ మహాజన్పై విచారణను ముగించినప్పటికీ, వారికి ఎలాంటి ఆర్థిక జరిమానా విధించలేదు. సైబర్ దాడి అనేది దురదృష్టకరమైన, ఊహించలేని ఘటన అని సీడీఎస్ఎల్ చేసిన వాదనను సెబీ తిరస్కరించింది.

భద్రతా నియంత్రణల్లో జరిగిన నిర్లక్ష్యం వల్లే మాల్వేర్ దాడి జరిగిందని, ఇది పూర్తిగా నివారించగలిగే పరిణామమని సెబీ పేర్కొంది. సెబీ గుర్తించిన ప్రధాన లోపాలుదర్యాప్తులో సీడీఎస్ఎల్ పలు కీలక సైబర్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది.

8 కీలక రంగాల వృద్ధి 5 శాతం

సిమెంట్, ఉక్కు రంగాల జోరు

న్యూఢిల్లీ,జులై 20: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే ఎనిమిది కీలక మౌలిక రంగాలు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 5% వృద్ధిని నమోదు చేశాయి. మేలో నమోదైన 3.2% వృద్ధితోపోలిస్తే ఇది గణనీయమైన మెరుగుదల. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన 2023 ప్రామాణికసంవత్సరంతో రూపొందించిన కొత్త శ్రే